గరిష్ఠం 31.0
కనిష్ఠం 24.0

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	588.80 (308.4658)	37,763	43,772
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.67 (4.01)	3,120.23	3,000.22
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.70 (45.30)	24,560	16,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.145 | డ్రెస్ : రూ.210 | స్కిన్‌లెస్ : రూ.240

మూసీనది ప్రక్షాళనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టడంతో ఉమ్మడి జిల్లాలోనూ మూసీ పరివాహక ప్రాంతవాసుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ప్రక్షాళన కార్యక్రమాన్ని మహానగరానికే పరిమితం చేయవద్దని ఉమ్మడి జిల్లా వాసులు కోరుతున్నారు. ఉమ్మడి రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో నదిలో కలిసే కాలుష్య వ్యర్థరసాయనాలను కూడా నిరోధించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ దిశగా కార్యాచరణకు ప్రజాప్రతినిధులు, అధికారులు నడుంకట్టాలనే సూచనలు వస్తున్నాయి.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి- నల్లగొండ)



ఇక్కడా ప్రక్షాళించాలి

- ఉమ్మడి జిల్లాలో సైతం మూసీ శుద్ధి ప్రాజెక్టును చేపట్టాలని డిమాండ్
- రసాయన వ్యర్థాలతో కాలుష్యకారకంగా మారిన నది
- వ్యర్థాలు కలవకుండా ప్రత్యేక కార్యాచరణ చేపడితేనే ప్రయోజనం
- కలుషిత నీటితో వ్యాధుల బారిన ప్రజలు
- సంతానలేమి, కేన్సర్ వంటి జబ్బులతో సతమతం

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని అనంతగిరి కొండల నుంచి మొదలయ్యే మూసీ నది ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్, ఉమ్మడి నల్లగొండ జిల్లాల్లో సుమారు 180 కిలోమీటర్ల వరకు ప్రవహిస్తుంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఈ నది ఒడ్డున ఉన్న పలు పరిశ్రమల నుంచి వస్తున్న రసాయన వ్యర్థాలను మూసీ నదిలోకి యథేచ్ఛగా విడుదల చేస్తున్నారు. ఓ వైపున హైదరాబాద్ మురుగు నీరు, మరోవైపున పరిశ్రమల వ్యర్థాలు మూసీ మురికి నదిగా, కాలుష్య పూరిత నీటితో ప్రవహిస్తోంది. దీంతో ఈ నది నీటిని వినియోగించలేని దుస్థితి ఉంది. ఉమ్మడి జిల్లాలో మూసీకి అనుసంధానంగా పిల్లాయిపల్లి, మక్తఅనంతారం, వెంకిర్యాల, అలీనగర్, రుద్రవెల్లి, రావులపల్లి, ఇంద్రియాల, బాచారం, ధర్మారెడ్డిపల్లి, భీమలింగం, అసిఫ్‌నహర్, వేములకొండ, లక్ష్మాపురం, దుప్పల్లి, పల్లివాడ వద్ద నిర్మించిన ఆనకట్టల ద్వారా సమీప ప్రాంతాలకు చెరువులకు కలుపుతూ కాల్వలు ఉన్నాయి. ఈ కాల్వల ద్వారా ఉమ్మడి జిల్లాలో సుమారు 90వరకు చెరువులు అనుసంధానమై ఉండగా, 1.10లక్షల ఎకరాలకు ప్రత్యక్షంగా సాగునీరు, పరోక్షంగా బోరుబావుల ద్వారా మరో లక్ష ఎకరాలకు నీరందుతుంది. ఈ నదిపై కేతేపల్లి వద్ద ప్రాజెక్టు నిర్మించారు. ఉమ్మడి జిల్లాలో కీలకమైన ఈ నది కాలుష్యకాసారంగా మారడంతో నీటిని వినియోగించుకోలేని దుస్థితి నెలకొంది. మూసీ సుందరీకరణ ప్రాజెక్టు చేపట్టిన ప్రభుత్వం దాన్ని హైదరాబాద్‌కు పరిమితం చేయకుండా ఉమ్మడి నల్లగొండ జిల్లాకు విస్తరించాలని ఈ ప్రాంత రైతాంగం, ప్రజాసంఘాల నాయకులు కోరుతున్నారు. ప్రధానంగా నది నీరు కలుషితం కాకుండా రసాయనవ్యర్థాలు కలవకుండా కఠినంగా వ్యవహరించాలని కోరుతున్నారు. గతంలోనే దీనిపై ప్రభుత్వానికి అనేక ప్రతిపాదనలు అందించామని, ఈసారైనా వాటికి మోక్షం కల్పించి మూసీ నది ప్రక్షాళనకు ఉమ్మడి జిల్లాలోనూ చర్యలు చేపట్టాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది.

ప్రాణాంతక వ్యాధులతో సతమతం

మూసీ నది కాలుష్యకాసారంగా మారిన నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ఈ నీటితో సాగయ్యే పంటల్లో వాటి ఆనవాళ్లు కన్పిస్తున్నాయి. మూసీ కింద సాగయ్యే వరిని ఆహారంగా వినియోగించకుండా, పశువులదాణాలకు, లిక్కర్ ఫ్యాక్టరీలకు మార్కెట్ ధర కంటే తక్కువకే విక్రయించాల్సిన దుస్థితి నెలకొంది. కూరగాయలు, ఆకుకూరల్లో వాటి మూలాలుంటున్నాయని, మూసీ నీటితో పండే ధాన్యం, కూరగాయలకు మార్కెట్‌లో డిమాండ్ ఉండడం లేదని రైతులు వాపోతున్నారు. మూసీ నీరు ప్రవహించే భూములు కూడా కాలుష్యపూరితమయ్యాయని వారు పేర్కొంటున్నారు. పశువులు సైతం ఈ నీటినే అనివార్యంగా తాగాల్సిన పరిస్థితిలో బక్కచిక్కిపోతున్నాయని, ఈ పశువుల ద్వారా వచ్చే పాలల్లో కూడా స్వచ్ఛత తక్కువగా ఉంటోందని చెబుతున్నారు. మూసీనది కాలుష్యభరితంగా మారడంతో ఇందులోని చేపలు కూడా విషపూరితమవుతున్నాయని, వీటిని తింటే వేగంగా కేన్సర్ బారినపడే ప్రమాదముందని వైద్యులు పేర్కొంటున్నారు. కాలుష్యభరితమైన మూసీ నీటిలో క్యాడియం, కాపర్, క్రోమియం, ఆర్సెనిక్, జింక్, నైట్రేట్‌ల శాతం ఎక్కువగా నమోదవుతోందని, ప్రాణాంతక కేన్సర్‌తో పాటు సంతానలేమి, హృద్రోగసమస్యలు, ఊపిరితిత్తుల రోగాలు, చర్మవ్యాధులు సోకుతున్నాయని, కొన్నిరోగాలతో అర్థాంతరంగా మరణాలు సంభవిస్తున్నాయని పలు అధ్యయనాల్లో తేలింది.

మూసీలో వ్యర్థాలు కలవకుండా నిరోధించాలి



మూసీనది ప్రక్షాళన హైద్రాబాద్‌కే పరిమితం కావద్దు. హైద్రాబాద్ దిగువన కూడా అనేక పరిశ్రమల నుంచి ప్రమాదకరమైన రసాయనవ్యర్థాలు నదిలో కలిసి నీరు కలుషితమవుతోంది. ఈ కంపనీల నుంచి నీటిని నదిలోకి వదలకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. ఉమ్మడి జిల్లాలోనూ మూసీ నది పై చెక్‌డ్యామ్‌ల వంటి నిర్మాణాలు, వాటికిఅనుసంధానంగా నీటిశుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయాలి.

- స్వామి, సీపీఎం వలిగొండ మండల కార్యదర్శి

మూసీ ప్రక్షాళన ప్రాజెక్టును ఉమ్మడి జిల్లాలోనూ చేపట్టాలి



మూసీ సుందరీకరణ, శుద్ధి ప్రాజెక్టు హైదరాబాద్‌కే పరిమితం చేయవద్దు. ఉమ్మడి జిల్లాలోనూ ఈ ప్రాజెక్టును అమలు చేయాలి. ప్రధానంగా హైదరాబాద్, రంగారెడ్డి, నల్లగొండ ఉమ్మడి జిల్లాల్లో మూసీ తీరప్రాంతంలోని వందలాది పరిశ్రమల నుంచి వ్యర్థ రసాయనాలను మూసీలో కలపకుండా నియంత్రించాలి. అందుకోసం కఠినంగా వ్యవహరించాలి. మూసీ నీటిని శుద్ధి చేసేందుకు ఎక్కడికక్కడ ట్రీట్మెంట్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలి.

- కొండమడుగు నరసింహ, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు

ఉమ్మడి జిల్లాలో సీఎంఆర్ (కస్టం మిల్లింగ్ రైస్) ఏళ్లుగా పెండింగ్‌లో ఉంది. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని సీఎంఆర్ కింద రైతులకు అప్పగిస్తారు. ఆ ధాన్యాన్ని మిల్లర్లు మర ఆడించి తిరిగి ప్రభుత్వానికి అప్పజెప్పాలి. అయితే కొన్ని సీజన్లుగా మిల్లర్లు సీఎంఆర్ అప్పగించకుండా పక్కదారి పట్టించినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇదిలా ఉండగా గత యాసంగి సీజన్‌కు సంబంధించిన సీఎంఆర్ అప్పగింతకు ఈ నెల 30వ తేదీ చివరి గడువు.

- సూర్యాపేట(కలెక్టరేట్), భువనగిరి అర్బన్, నల్లగొండ



సీఎంఆర్ పెండింగ్

- మూడు సీజన్లుగా ఇదే పరిస్థితి
- ఈనెల 30తో ముగియనున్న గడువు
- పెండింగ్ ఉన్న మిల్లులకు వానాకాలం ధాన్యం అప్పగించవద్దని ప్రభుత్వ ఆదేశం
- బకాయిదారులపై ఆర్ఆర్ యాక్టు అమలుకు చర్యలు

సూర్యాపేట జిల్లాలో నాలుగు సీజన్లుగా కొంత మంది మిల్లర్లు ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బియ్యాన్ని అప్పగించలేదు. జిల్లాలో మొత్తం 48 రైస్ మిల్లులకు ఏటా సీఎంఆర్ ధాన్యాన్ని అధికారులు అప్పగిస్తున్నారు. జిల్లాలోని 23 మండలాల పరిధిలో ఉన్న 3లక్షలకు పైగా ఉన్న రేషన్‌కార్డుదారులకు ప్రతీ నెల రేషన్ బియ్యం పంపిణీ చేయాల్సి ఉంటుంది. అందుకు ఏడాదికి 67,152 మెట్రిక్ టన్నుల బియ్యం అవసరం. సకాలంలో సీఎంఆర్ అప్పగించకపోవడంతో రేషన్ బియ్యం పంపిణీ అధికారులకు ఇబ్బందిగా మారుతోంది. జిల్లాలో మూడు సీజన్లకు సంబంధించి సుమారు 2లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ప్రభుత్వానికి రావాల్సి ఉంది. 2022-23 వానాకాలం సీజన్‌లో 3,13,333 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లర్లకు అప్పగించగా, 2,10,727 మెట్రిక్ టన్నుల బియ్యం రావాల్సి ఉంది. కాగా, ఇప్పటి వరకు 1,91,095మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మిల్లర్లు ప్రభుత్వానికి అప్పగించగా, ఇంకా 19,631 మెట్రిక్ టన్నులు పెండింగ్‌లో ఉంది.

2023-24 వానాకాలం సీజన్‌లో 2,08,113 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అధికారులు కొనుగోలు చేశారు. మిల్లుల నుంచి ప్రభుత్వానికి 1,39,436 మెట్రిక్ టన్నుల బియ్యం రావాల్సి ఉంది. కాగా, ఇప్పటి వరకు 78,972 మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే వచ్చింది. 61,004 మెట్రిక్ టన్నుల బియ్యం పెండింగ్‌లో ఉంది. మొత్తంగా 56.64శాతం మాత్రమే సీఎంఆర్ పూర్తయింది.

2023-24 యాసంగి సీజన్‌లో ప్రభుత్వం 2,40,578 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు తరలించింది. అందుకు మిల్లర్లు 1,63,163 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని తిరిగి ఇవ్వాల్సి ఉంది. కాగా ఇప్పటి వరకు 42,196 మెట్రిక్ టన్నులు మాత్రమే అందించగా ఇంకా 1,18,812 మెట్రిక్ టన్నుల బియ్యం పెండింగ్‌లో ఉంది. ఈ సీజన్‌లో కేవలం 26శాతం మాత్రమే సీఎంఆర్ పూర్తయింది. మిల్లుల్లో ధాన్యాన్ని బియ్యంగా మార్చినందుకు క్వింటాకు రూ.70చొప్పున ప్రభుత్వం చార్జి చెల్లిస్తుంది. దీంతో పాటు బియ్యాన్ని సివిల్‌సప్లయ్‌శాఖ గోదాంలకు తరలించినందుకు దూరాన్ని బట్టి రవాణా చార్జీలను కూడా చెల్లిస్తుంది. యాదాద్రి జిల్లాలో 2023-24 వానాకాలానికి సంబంధించి 1,77,682 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మిల్లర్లు అప్పగించాల్సి ఉండగా, 1,38,848 మెట్రిక్ టన్నులు అప్పగించారు. ఇంకా 38,834 మెట్రిక్ టన్నులు రావాల్సి ఉంది. 2023-24 యాసంగికి సంబంధించి 1,81,326 మెట్రిక్ టన్నులకు 68,709 మెట్రిక్ టన్నులు అప్పగించగా, ఇంకా 1,12,617 మెట్రిక్ టన్నులు పెండింగ్‌లో ఉంది. నల్లగొండ జిల్లాలో 35 మిల్లులకు 2023-24 వానాకాలంలో సీజన్‌కు చెందిన 3,22,754 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని అప్పగించారు. అందుకు 2,17,577 మెట్రిక్ టన్నుల బియ్యం అప్పగించాల్సి ఉంది. కాగా, ఇప్పటి వరకు 1,98,863 మెట్రిక్ టన్నులు అప్పగించగా, ఇంకా 18,733 మెట్రిక్ టన్నులు పెండింగ్‌లో ఉంది.

30తో ముగియనున్న గడువు

ఈనెల 30వ తేదీతో కస్టమ్ మిల్లింగ్ రైస్ సరఫరా చేసే తేదీ ముగుస్తుంది. పౌరసరఫరాలశాఖ అధికారులు 48 మిల్లులకు ధాన్యాన్ని సరఫరా చేయగా, అందులో కొన్ని మిల్లులు మాత్రమే కస్టమ్ మిల్లింగ్ ద్వారా ప్రభుత్వానికి బియ్యం సరఫరా చేశాయి. గత ఏడాది సూర్యాపేట జిల్లాలో పలువురు మిల్లు యజమానులు ప్రభుత్వానికి సరఫరా చేయాల్సిన ధాన్యంతో పాటు బియ్యాన్ని అక్రమంగా విక్రయించారన్న ఆరోపణలు ఉన్నాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఈ విషయాలు ఆలస్యంగా వెలుగుచూశాయి. సంబంధిత మిల్లు యజమానులపై పౌరసరఫరాలశాఖ అధికారులు పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేయగా కేసులు కూడా నమోదయ్యాయి. అయినా కోట్ల రూపాయలు విలువ చేసే బియ్యాన్ని మాత్రం అధికారులు రికవరీ చేయలేకపోయారు.

పెండింగ్‌లో మిల్లింగ్ చార్జీలు

ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని బియ్యంగా మార్చేందుకు వివిధ రైస్ మిల్లులకు పంపిస్తున్నారు. సంబంధిత మిల్లుల్లో ధాన్యాన్ని బియ్యంగా మార్చినందుకు క్వింటాకు రూ.70చొప్పున మిల్లింగ్ చార్జి ప్రభుత్వం చెల్లించాలి. దీంతో పాటు సంబంధిత మిల్లుల నుంచి పౌరసరఫరాలశాఖ గోదాంలకు తరలించినందుకు రవాణా చార్జీలు కూడా చెల్లించాలి. అయితే ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలో కొన్నేళ్లుగా మిల్లర్లకు ప్రభుత్వం మిల్లింగ్ చార్జీలు కోట్లలో బకాయి పడింది. ప్రభుత్వం ఎప్పటికప్పుడు మిల్లింగ్ చార్జీలు చెల్లించకపోవడంతో సంబంధిత మిల్లుల యాజమాన్యాలు బియ్యాన్ని విక్రయించుకుంటున్నారు. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరకుండా పోతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం మిల్లర్లకు బకాయి ఉన్న చార్జీలను వెంటనే చెల్లించి వారి నుంచి రావాల్సిన బియ్యాన్ని నిర్దేశించిన సమయంలో రికవరీ చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

పెండింగ్‌లో ఉన్న మిల్లులకు ధాన్యం నిలిపివేత

సీఎంఆర్ పెండింగ్‌లో ఉన్న మిల్లులకు ప్రస్తుత వానాకాలం సీజన్‌కు సంబంధించిన ధాన్యాన్ని సరఫరా చేయకుండా నిలిపివేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. సీఎంఆర్ పెండింగ్‌లో ఉన్న మిల్లుల జాబితాను అధికారులు ఇప్పటికే సిద్ధం చేశారు. గతంలో సీఎంఆర్ పెండింగ్‌లో ఉన్నా ప్రతీ సీజన్‌లో అధికారులను మిల్లర్లు మచ్చిక చేసుకుని ధాన్యాన్ని కేటాయింపులు చేసుకునేవారు. ఈ సారి మాత్రం బ్లాక్‌లిస్టులో ఉన్న మిల్లులకు ఎట్టి పరిస్థితుల్లో ధాన్యం కేటాయింపులు చేయవద్దని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు.

బకాయిదారులపై ఆర్ఆర్ యాక్టు

సీఎంఆర్ బకాయిదారులపై ఆర్ఆర్ యాక్టు అమలు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో ఆరుగురు మిల్లర్లపై ఆర్ఆర్ యాక్టు అమలు చేసేందుకు సిద్ధమైనట్టు సమాచారం. అంతేగాక సీఎంఆర్‌ను ఆలస్యంగా పూర్తి చేస్తున్న మిల్లర్లకు 25శాతం జరిమానా విధిస్తున్నారు. ఈ విధంగా జిల్లాలోని పలువురు మిల్లర్లు కోట్ల రూపాయలు ప్రభుత్వానికి బకాయిగా ఉన్నారు. వానాకాలం ధాన్యానికి ప్రభుత్వం మిల్లర్ల నుంచి ముందుగానే బ్యాంకు గ్యారెంటీ తీసుకోవాలని ఆలోచన చేస్తోంది. మిల్లుల సామర్థ్యం మేరకు సరఫరా చేసే ధాన్యం విలువలో 25శాతం మిల్లర్లు బ్యాంకు గ్యారెంటీని ప్రభుత్వానికి సమర్పించాలి.

బకాయిదారులపై చర్యలు తీసుకుంటాం

జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ రైస్ లక్ష్యాన్ని 100శాతం పూర్తి చేస్తాం. ఇప్పటికే కొంతమేర సరఫరా చేశారు. మిగిలిన బియ్యాన్ని మిల్లర్ల నుంచి సేకరించేందుకు చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే మిల్లర్లకు నిర్దేశించిన సమయంలోపు బియ్యం సరఫరా చేయాలని ఆదేశించాం. ఎవరైనా మిల్లర్లు బియ్యం సరఫరా చేయకపోతే వారిపై చట్టపరంగా చర్యలు చేపడతాం. సీఎంఆర్ పెండింగ్‌లో ఉన్న మిల్లులకు వానాకాలం ధాన్యం కేటాయింపులు చేయవద్దని ప్రభుత్వం ఆదేశించింది. బకాయిదారులపై ఆర్ఆర్ యాక్టు అమలుకు చర్యలు తీసుకుంటున్నాం.

- రాజేశ్వర్, సూర్యాపేట జిల్లా పౌరసరఫరాల అధికారి

సీఎంఆర్‌లో మార్పులు చేయాలంటున్న అసోసియేషన్

ప్రస్తుత సీఎంఆర్ విధానంలో పలు మార్పులు చేయాలని, లేని పక్షంలో వానాకాలంలో సీఎంఆర్ చేసేది లేదని ఇటీవల మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రభుత్వానికి విన్నవించారు. వానాకాలం సీజన్‌లో ఎక్కువగా సన్న రకం ధాన్యం పండిస్తారని. 17శాతం తేమతో ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు సరఫరా చేసి క్వింటాకు 67కిలోల చొప్పున బియ్యం ఇవ్వాలంటే ఇబ్బందిగా ఉందని మిల్లర్లు పేర్కొంటున్నారు. సన్నరకం ధాన్యం తేమ శాతాన్ని 14కు తగ్గించడంతో పాటు క్వింటాకు 60 కిలోల చొప్పున బియ్యం సరఫరా చేసే విధంగా నిబంధనలు మార్చాలని వారు కోరుతున్నారు. అంతేగాక పెండింగ్‌లో ఉన్న కస్టమ్ మిల్లింగ్, రవాణా చార్జీలు వెంటనే విడుదల చేయాలని కోరుతున్నారు. ఈ డిమాండ్లను ప్రభుత్వం అంగీకరిస్తేనే వానాకాలంలో సీఎంఆర్ చేస్తామని మిల్లర్లు స్పష్టం చేశారు. ఈ విషయంలో సూర్యాపేట జిల్లాలో మిల్లర్లు ఆలోచన చేస్తున్నట్లు సమాచారం.

హైడ్రా పేరుతో పేదలపై దమనకాండ

● సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి



కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

సూర్యాపేట(కలెక్టరేట్), సెప్టెంబరు 28: హైడ్రా పేరుతో రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలపై దమనకాండ సాగిస్తుందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి స్పష్టంచేశారు. శనివారం పట్టణంలోని సద్దుల చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల ప్రభావిత వార్డులైన 30, 42, 43వ వార్డుల్లో పర్యటించారు. ఇటీవల సూర్యాపేటలో సద్దుల చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లు అంటూ సర్వే పేరుతో అధికారులు పలు నివాసాలకు మార్కింగ్ చేస్తున్నారని, దానిని వెంటనే నిలిపివేయాలన్నారు. నీటి వనరుల సంరక్షణతో పాటు ప్రజల బాధ్యత కూడా ప్రభుత్వానిదేనన్నారు. తప్పులన్నీ ప్రభుత్వం చేసి ప్రజలకు శిక్షలు వేస్తామంటే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. ఒక్క సూర్యాపేటలోనే రూ.వెయ్యికోట్ల నష్టం వాటిల్లుతుంటే రాష్ట్రం మొత్తంలో ఎంత నష్టం జరుగుతుందో ఊహకు అందడం లేదన్నారు. ప్రాణాలు పోయినా పేదల ఇళ్ల కూల్చివేతలు మాత్రం జరగనివ్వమని తేల్చి చెప్పారు. అవసరమైతే ప్రభుత్వం చేస్తున్న పనికిమాలిన పనులపై న్యాయ పోరాటానికి సైతం వెనుకాడబోమన్నారు. తక్షణమే పేదల ఇళ్ల కూల్చివేతలను ఆపి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లపై శాస్త్రీయంగా హద్దులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, వైస్ చైర్మన్ పుట్టా కిశోర్‌కుమార్, నాయకులు గండూరి ప్రకాష్, జీడి భిక్షం, అంగిరేకుల నాగార్జున, గాలి సాయికుమార్, బత్తుల రమేష్, గుర్రం సత్యనారాయణరెడ్డి, భూక్యా సంజీవనాయక్, వంగాల శ్రీనివాసరెడ్డి, జీవన్‌రెడ్డి, భాష, జహీర్, మద్ది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆడ బిడ్డల ఆత్మగౌరవం పెంచిన ఘనత కేసీఆర్‌దే

రాష్ట్రంలోని ఆడ బిడ్డల ఆత్మగౌరవాన్ని పెంచిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దేనని గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో నియోజకవర్గంలోని లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీచేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలవుతున్నా ఇంకా మాజీ సీఎం కేసీఆర్ అందించిన లక్ష మాత్రమే అందుతుందన్నారు. కాంగ్రెస్ పాలనలో అన్నీ పగటికలలుగానే మిగిలిపోతున్నాయన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలుకు నోచడం లేదన్నారు. ప్రజలు మాజీ సీఎం కేసీఆర్‌ను దూరం చేసుకున్నామని బాధపడుతున్నారని వివరించారు. కార్యక్రమంలో ఆర్డీవో వేణుమాధవ్, మునిసిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, వైస్ చైర్మన్ పుట్టా కిశోర్‌కుమార్‌తో పాటు ఆయా వార్డుల కౌన్సిలర్లు, మండలాల అధికారులు పాల్గొన్నారు.

రసూల్ మృతి బాధాకరం

సూర్యాపేటలోని బిలాల్ మసీదు చైర్మన్ రసూల్ మరణం బాధాకరమని ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. శనివారం అనారోగ్యంతో మరణించిన రసూల్ మృతదేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం రసూల్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనవెంట తాహేర్‌పాషా, భాషా, రియాజుద్దీన్, సయ్యద్, రఫీ తదితరులు ఉన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

● కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ● జనరల్ ఆస్పత్రిని తనిఖీ చేసిన కలెక్టర్ ● సదరన్ సర్టిఫికెట్ల ఆరోపణలపై విచారణకు ఆదేశం



ఆస్పత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న డాక్టర్ నందలాల్ పవార్

సూర్యాపేట సిటీ, సెప్టెంబరు 28: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. జిల్లాకేంద్రంలోని జనరల్ ఆస్పత్రిని శనివారం కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా కొంత మంది రోగులు ఆస్పత్రిలో వైద్యం సక్రమంగా అందడంలేదని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో మందులు లభించడంలేదని, కొన్ని మందులను ప్రైవేటుగా కొనుగోలు చేయాల్సి వస్తుందన్నారు. ఇన్‌జంక్షన్లు సైతం అందుబాటులో లేవని, సెలైన్ పైపులను బయట కొనుగోలు చేస్తున్నామన్నారు. పూర్తిస్థాయిలో ఆస్పత్రిలో మందులు లేకపోవడంతో కారణాలు ఏమిటని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వానికి ఇండెంట్ పెట్టామని, నేటివరకు మందులు సరఫరా కాలేదని వైద్యులు తెలిపారు. రోగులకు చేసిన వైద్య పరీక్ష ఫలితాలకోసం రోజుల తరబడి ఎదురుచూడాల్సి వస్తుందని, కొంతమంది రోగులు కలెక్టర్ ఎదుట వాపోయారు. అనంతరం రక్త పరీక్ష కేంద్రాన్ని పరిశీలించారు. సెంట్రల్ డ్రగ్ స్టోర్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. సదరన్ క్యాంప్ సరిఫికెట్ల విషయంలో పలు ఆరోపణలు వస్తున్నాయని అక్రమాలపై విచారణకు ఆదేశిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట జనరల్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

భానుపురి: సూర్యాపేట ప్రాంతీయ ఆస్పత్రిని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తనిఖీచేశారు. ప్రాంతీయ ఆస్పత్రి గేటునుంచి వివిధ విభాగాలను తనిఖీచేస్తూ వెళ్లారు. సదరన్ క్యాంప్ గదిలో పనిచేసే వైద్యులు రిజిస్టర్‌లో సంతకాలు చేయడంలేదని, సదరన్ సర్టిఫికేట్ల రికార్డు సక్రమంగా లేదని ఆగ్రహించారు. కలెక్టర్ అరగంటపాటు గదిలోనే ఉన్నా సిబ్బంది రాలేదు. ఆ తర్వాత వచ్చిన ఒకరిని ప్రశ్నించారు. రికార్డులు సక్రమంగా లేవని, విధులకు సక్రమంగా రావడం లేదని గదికి తాళం వేసి సీజ్ చేయించారు. డయాలసీస్ వింగ్‌లో రోగిని ఏలా ఉందని వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాటర్ ఫిల్టర్ బెడ్ గది అస్తవ్యస్తంగా ఉందని కలెక్టర్ ఆర్ఎంను అడిగారు.

పెంపుడు కుక్కల వివరాలను ఆన్‌లైన్ చేయాలి

పెంపుడు కుక్కల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. పశుసంవర్థక శాఖ ప్రాంతీయ కార్యాలయంలో ప్రపంచ రేబిస్ నివారణ దినోత్సవం సందర్భంగా కుక్కలకు టీకాలువేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి శ్రీనివాసారావు, ఏడీలు జానయ్య, కృష్ణ, గోపి, కిరణ్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేటరూరల్: జిల్లాలోని మహిళా సంఘాలన్నీ ఆర్థికంగా బలబడి కోటీశ్వర్లుగా మహిళలను చూడాలని ఉందని కలెక్టర్ తేజస్ నందాలాల్ పవార్ అన్నారు. సూర్యాపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో భానుపురి జిల్లా సమాఖ్య ఆరో సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో వీవీ అప్పారావు, డిప్యూటీ సీఈఓ శిరీష, అదనపు డీఆర్డీవో సురేష్, రమణ, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

పరాన్న జీవిలా ప్రజలను పీడించిన బీఆర్ఎస్

● ఉద్యమకారులను విస్మరించినందుకే అధికారానికి దూరం ● టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరాం



సమావేశంలో మాట్లాడుతున్న కోదండరాం

సూర్యాపేటటౌన్, సెప్టెంబరు 28: గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను పరాన్న జీవిలా పీడించిందని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శనివారం నిర్వహించిన తెలంగాణ జనసమితి జిల్లా ప్లీనరీలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించడమే కాకుండా, తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టిన తెలంగాణ అమరవీరులను విస్మరించిన బీఆర్ఎస్ ప్రజల నమ్మకాన్ని కోల్పోయి అధికారానికి దూరమైందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో నిరుద్యోగులు, విద్యార్థులు, ప్రజలు నోరెత్తే పరిస్థితి ఉండేది కాదన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగ బద్ధంగా ప్రతి ఒక్కరూ తమ సమస్యలు చెప్పుకునే అవకాశాలు కల్పిస్తోందన్నారు. రాజకీయ మార్పు, నైతిక విలువల కోసం టీజేఎస్ పార్టీ స్థాపించామని, అనుకున్న లక్ష్యం దిశగా పయనిస్తున్నామన్నారు. అమరుల త్యాగాలు, ఆత్మ బలిదానాలను బీఆర్ఎస్ స్మరించుకోలేకపోయిందని మండిపడ్డారు. బీఆర్ఎస్ చేసిన అవినీతి అప్పులకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి నెలా రూ. 5వేల కోట్లు అప్పులు కడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంట్ల ధర్మార్జున్, జిల్లా అధ్యక్షుడు గట్ల రమాశంకర్, రాష్ట్ర నాయకులు సర్దార్ వినోద్, శ్రీనివాస్‌రెడ్డి, నారబోయిన కిరణ్‌కుమార్, బచ్చలకూరి గోపి, బొడ్డు శంకర్, చంద్రకాంత్, వీరేష్‌నాయక్, బొమ్మగాని వినయ్, భిక్షంనాయక్, సూర్యనారాయణ, కృష్ణారెడ్డి, శ్రీనునాయక్, సుమన్‌నాయక్, రాములుగౌడ్, యాకుబ్ రెడ్డి, గోపి, మధుసూధన్‌రెడ్డి పాల్గొన్నారు.

1969 ఉద్యమకారులను ఆదుకోవాలి

రాష్ట్ర ప్రభుత్వం 1969 తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులను ఆదుకోవాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి లక్ష్మీనారాయణ కోరారు. జిల్లాకేంద్రంలోని ఓఫంక్షన్‌హాల్‌లో ఎమ్మెల్సీ కోదండరాంకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. వీరితోపాటు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తలమల్లహసెన్, ఐఎఫ్‌టీయూ నాయకులు గంటా నాగయ్య, కుసుకుంట్ల సైదులు ఎమ్మెల్సీ కోదండరాంనకు వినతిపత్రం అందజేశారు.

కేసుల సత్వర పరిష్కారానికి
లోక్ అదాలత్

● జిల్లా జడ్జి ఎస్.గోవర్ధన్‌రెడ్డి

సూర్యాపేటలీగల్, సెప్టెంబరు 28: కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్‌లు ఉపయోగపడతాయని జిల్లా జడ్జి ఎస్.గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం జాతీయ లోక్‌అదాలత్‌ను కోర్టుప్రాగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి ఎస్.గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ లోక్‌అదాలత్‌లో 2,980 కేసులు పరిష్కారమయ్యాయన్నారు. లోక్‌అదాలత్‌కు హాజరైన కక్షిదారులకు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కొండపెల్లి లక్ష్మారెడ్డి, రీజినల్ సెక్రెటరీ రాచకొండ శ్రీను ఆధ్వర్యంలో దాతలుగా మొరిశెట్టి లక్షాదీ, పోతు రమేష్ అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జిల్లా జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ ఎస్.గోవర్ధన్‌రెడ్డి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రెటరీ, సీనియర్ సివిల్ జడ్జి పి.శ్రీవాణి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.సురేష్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.ప్రశాంతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్‌రెడ్డి, మల్లయ్య, జె.శశిధర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల లోపే బంగారం తాపడం

- పర్యవేక్షణకు కమిటీ నియామకం
- సభ్యుల సూచనలతో ముందుకు



భువనగిరి అర్బన్, సెప్టెంబరు 28 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యవిమాన రాజగోపురం బంగారు తాపడానికి వేగంగా సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ మేరకు హైదరాబాద్‌లో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ శనివారం సమీక్షలు జరిపారు. ఈ మేరకు వచ్చే ఏడాది జరిగే వార్షిక బ్రహ్మోత్సవాల్లోపు తాపడం పూర్తి చేసేందుకు పనులకు శ్రీకారం చుట్టాలని మంత్రి ఆదేశించారు. తాపడం పనుల పర్యవేక్షణకు ఉన్నతస్థాయి అధికారులతో ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేయగా సభ్యుల సూచనలతో పనులు వేగంగా ముందుకు సాగనున్నాయి. తాపడం పనుల బాధ్యత స్మార్ట్ క్రియేషన్స్ కంపెనీకి ప్రభుత్వం అప్పగించింది. పర్యవేక్షణకు ఉన్నత స్థాయి అధికారులతో కమిటీని నియమించింది. చైర్‌పర్సన్‌గా శైలజా రామయ్యర్, దేవాదాయ శాఖ డైరెక్టర్ కన్వీనర్‌గా, ప్రభుత్వ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ప్రాజెక్టుల సలహాదారుడు, వైటీడీఏ వైస్‌చైర్మన్ జీ కిషన్‌రావు, ఆలయ ఈవో, విద్యుత్ శాఖ చీఫ్ ఇంజనీర్ సభ్యులుగా ప్రభుత్వం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీ బంగారు తాపడం పనులను పర్యవేక్షిస్తూ సూచనలు, సలహాలు ఇవ్వనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం బంగారు తాపడం పనులు, వాటి పర్యవేక్షణకు సంబంధించి ప్రత్యేక కమిటీ ఏర్పాటుకు రెండు వేర్వేరు జీవోలను ప్రభుత్వం జారీ చేసింది. కాగా, స్వామివారి సన్నిధిలో ఇప్పటికే నగదు, బంగారం అందుబాటులో ఉంది. నిల్వ ఉన్న 2,500 కిలోల వెండిని బంగారం కోసం కొనుగోలు చేస్తే 16 కిలోల లభిస్తుంది. అంతకుముందు బంగారం 10 కిలోలు ఉండగా, భక్తుల కానుకల రూపంలో హుండీల ద్వారా సమకూరిన మిశ్రమ బంగారం 10కిలోలతో కలిపి మొత్తం 36 కిలోలు ఉంది. అదేవిధంగా రూ.20కోట్ల నగదు ఉండగా అందులో రూ.5కోట్లు తయారీకి ఖర్చు అయినప్పటికీ మిగిలిన రూ.15కోట్లతో సుమారు మరో 20కిలోల బంగారం కొనుగోలు చేయవచ్చు. దీంట్లో చేతితో తాపడం పనులు చేస్తే 100 కిలోల బంగారు అవసరం కాగా మిషన్ల ద్వారా మాత్రం 60 కిలోల బంగారు ఉపయోగించాల్సి ఉంటుందని, ఇంకా అవసరం అనుకుంటే 12కిలోల బంగారు బాండులు ఉన్నట్లు ఈవో ఏ భాస్కర్‌రావు తెలిపారు.

లక్ష్మీసమేతుడి సన్నిధిలో ఏకాదశి పూజలు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి వారి సన్నిధిలో శనివారం ఏకాదశి పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. ప్రధానాలయ ముఖమండపంలో ఉత్సవ మూర్తులకు వివిధ రకాల పుష్పాలతో లక్షపుష్పార్చన చేశారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ సహస్రనామాలు పఠించారు. అదేవిధంగా నిత్యపూజలు కొనసాగాయి.

సంప్రదాయబద్ధంగా మట్టపల్లివాసుడి కల్యాణం

మఠంపల్లి: సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని మట్టపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్యకల్యాణం వేదపండితులు శనివారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. భక్తవత్సలుడికి నిజాభిషేకం, నిత్యార్చనలు చేశారు. ఆర్జిత కైంకర్యాలు నిర్వహించారు. అనంతరం దివ్యమూర్తులకు గరుడోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్, అర్చకులు పాల్గొన్నారు.

స్వామి వారిని దర్శించుకున్న పీఠాధిపతులు



రామానుజజీయర్‌స్వామికి పూర్ణకుంభంతో స్వాగతం

మట్టపల్లి శ్రీలక్ష్మీనృసింహ స్వామి వారిని అనంత శ్రీవిభూషిత భాష్యకార సిద్ధాంత పీఠాధిపతులు(భీమవరం) రామచంద్ర రామానుజజీయర్‌స్వామి దర్శించుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆయనకు ధర్మకర్తలు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో నవీన్‌లు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ ప్రతీ మానవుడు తనధర్మాన్ని పాటిస్తూ భక్తి భవాలను అలవర్చుకోవాలన్నారు.

అయ్యప్ప ఆలయంలో 41 రోజుల వేడుక

నేరేడుచర్ల: సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పట్టణంలో నిర్మించిన నూతన ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయం 41 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హోమం కార్యక్రమాలు నిర్వహించారు. పడిపూజ కార్యక్రమాన్ని గురుస్వామి చిన్నపల్లి శ్రీనుస్వామి నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ శాశ్వత కమిటీ చైర్మన్ కొణతం కృష్ణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాష్, వైస్ చైర్మన్ అలకసరిత, కొణతం చిన వెంకటరెడ్డి, ఎస్ఐ రవీందర్, బెల్లంకొండ నర్సింహారావు, తాళ్ల సురేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో ప్రసవం

● సహకరించిన తోటి మహిళలు ● పండంటి బిడ్డకు జన్మనిచ్చిన మహిళ



ఆర్టీసీ బస్సులో ప్రసవమైన అలివేలు, పుట్టిన పాపతో ప్రయాణికురాలు

కోదాడ రూరల్, సెప్టెంబరు 28: సూర్యాపేట జిల్లా కోదాడ సమీపంలో ఓ మహిళ ఆర్టీసీ బస్సులో ప్రసవించింది. తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కోదాడ మండలం గుడిబండ గ్రామానికి చెందిన అలివేలు ఏడు నెలల గర్భిణి. ఆరోగ్య పరీక్షల కోసం శనివారం ఉదయం సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి తిరిగి గ్రామానికి వచ్చేందుకు సూర్యాపేట-కోదాడ ఆర్డినరీ బస్సు ఎక్కింది. మునగాల మండలం తాడువాయికి చేరుకోగానే పురిటినొప్పులు మొదలయ్యాయి. దీంతో విషయాన్ని తోటి ప్రయాణికులకు తెలిపింది. వెంటనే డ్రైవర్ బస్సును రోడ్డు పక్కన నిలిపాడు. పురిటినొప్పులు ఎక్కువ కావడంతో బస్సులోని మహిళలందరూ కలిసి అలివేలుకు పురుడుపోశారు. పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. సమాచారం అందుకున్న 108 వాహనం అక్కడి చేరుకొని అలివేలు, పాపను సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. కోదాడ డిపో మేనేజర్ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకుని డిపో డ్రైవర్ నరేష్, కండక్టర్ల నరేష్‌ను అభినందించారు.

హరితహోటల్ కోసం మూడెకరాలు అవసరం



ఎల్లారెడ్డిగూడెం వద్ద స్థలపరిశీలన చేస్తున్న పర్యాటక శాఖ జీఎం ఉపేందర్‌రెడ్డి, ఆర్డీవో శ్రీదేవి

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 28 : హరిత హోటల్ నిర్మాణానికి కనీసం మూడు ఎకరాల స్థలం అవసరమని నల్లగొండ ఇన్‌చార్జి ఆర్డీవో శ్రీదేవి, పర్యాటక శాఖ జీఎం ఉపేందర్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే హరిత హోటల్ నిర్మాణం కోసం నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెం శివారులో శనివారం స్థల పరిశీలన చేశారు. జిల్లాలో కొన్ని చోట్ల హరిత హోటల్స్ నిర్మాణానికి పర్యాటక శాఖ ముందుకు వచ్చింది. హోటల్ నిర్మాణం కోసం అనువైన స్థల అన్వేషణలో భాగంగా ఎల్లారెడ్డిగూడెం శివారులో ఉన్న సర్వే నంబరు 280లో రెవెన్యూ శాఖకు చెందిన భూమిని పరిశీలించినట్లు అధికారులు తెలిపారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, నాయబ్ తహసీల్దార్ తరుణ ఉన్నారు. కాగా ఈ భూమి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో బలహీన వర్గాల గృహనిర్మాణం కోసం చెర్వుగట్టు పార్వతీజడల రామలింగేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన భూమిని రెవెన్యూ శాఖ కొనుగోలు చేసింది. అయితే స్థలాన్ని రాజకీయ కారణాలతో పేదలకు పంపిణీ చేయలేకపోయారు.

ఆర్టీవో అధికారులమంటూ టోకరా

నిడమనూరు, సెప్టెంబరు 28 : ఆర్టీవో అధికారుల పేరుతో ఇద్దరు ఓ ట్రాక్టర్ యజమానికి టోకరా ఇచ్చారు. డ్రైవింగ్ లైసెన్స్ లేదన్న కారణంతో జరిమానా పేరిట వసూళ్లకు పాల్పడి రశీదు ఇవ్వకుండా ఉడాయించారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నిడమనూరు మండలంలో వెలుగుచూసింది. బాధితుడి కథనం ప్రకారం త్రిపురారం మండల కేంద్రానికి చెందిన పడిశల శివకు చెందిన ట్రాక్టర్ శుక్రవారం నిడమనూరు మండలం గుంటిపల్లిలో పశువుల ఎరువును దిగుమతి చేసి త్రిపురారం వైపు ట్రాక్టర్ తిరిగి వస్తోంది. ఈ క్రమంలో ట్రాక్టర్ నిడమనూరు మండలంలోని బొక్కమంతలపహాడ్ సమీపంలోని ఆముదాల మిల్లు వద్దకు రాగా వెనుక నుంచి యూనికార్న్ వాహనంపై వచ్చిన ఓ ఇద్దరు వ్యక్తులు ట్రాక్టర్‌ను ఆపి, ఆర్టీవో ఆపితే ఆపకుండా వెళ్లిపోవడం ఏంటి అంటూ డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ డ్రైవింగ్ లైసెన్స్ చూపించాలంటూ బెదిరించారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తీసుకురావాలని లేదా సెటిల్‌మెంట్ చేసుకోవాలని హెచ్చరించారు. జరిమానా చెల్లిస్తే ట్రాక్టర్ వదిలేస్తామని చెప్పడంతో డ్రైవరు ట్రాక్టర్ యజమాని శివతో ఫోన్‌లో మాట్లాడించారు. అనంతరం రూ.4,350 జరిమానా ఫోన్‌పేలో చెల్లించాలని చెప్పగా శివ తన మొబైల్ ఫోన్ నుంచి 8340948242 నెంబర్‌కు ఫోన్‌పే చేశాడు. జరిమానా చెల్లించినట్లు రశీదు అడుగుతుండగానే ఆ ఇద్దరు అక్కడి నుంచి ఉడాయించారు. రశీదు ఇవ్వకుండా ఉడాయించడంపై అనుమానం వచ్చిన ట్రాక్టర్ యజమాని శివ ఫోన్‌పే చేసిన నెంబరుకు కాల్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో ఆర్టీవో అధికారి పేరుతో తనకు టోకరా వేశారని గుర్తించిన శివ శనివారం నిడమనూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు. ఈ సంఘటనపై ఎస్ఐ గోపాల్‌రావు వివరణ కోరగా ఆర్టీవో పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడిన ఘటనపై ఫిర్యాదు వచ్చిందని, సంఘటనపై విచారణ చేస్తున్నామని తెలిపారు ఫోన్‌పే అకౌంట్ వివరాలు సేకరించి నిందితులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బిల్లుల కోసం నిర్వాహకులకు నోటీసులిచ్చాం

తిరుమలగిరి, సెప్టెంబరు 28 : ఇసుక రాశులు ఉన్న వెంచర్ల యజమానులకు బిల్లులు సమర్పించాలని నోటీసులు ఇచ్చామని రెవెన్యూ, మైనింగ్ అధికారులు తెలిపారు. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి పట్టణ పరిధి అనంతారం సమీపంలోని సీ5 కంపెనీలో ఇసుక మాయంపై ఫిర్యాదుల మేరకు శనివారం వారు విచారణ చేపట్టారు. అనంతారం ప్రాంతానికి చెందిన కొందరు నిల్వ ఉన్న ఇసుకను అక్రమంగా తరలించారన్న ఫిర్యాదుతో విచారణ చేపట్టామన్నారు. సీ5 కంపెనీలో 700 క్యూబిక్ మీటర్ల ఇసుక ఉందన్నారు. జైభారత్, ఎంకేఆర్ వెంచర్‌లో అక్రమ ఇసుక డంపులు ఉన్నాయన్న ఫిర్యాదుపై కూడా విచారణ చేపట్టామని, వెంచర్లో 30 టిప్పర్ల ఇసుక రాశులు ఉన్నాయన్నారు. వాటికి సంబంధించిన బిల్లులు సమర్పించాలని వెంచర్ నిర్వాహకులకు నోటీసులు ఇచ్చామన్నారు. పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మైనింగ్ శాఖ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ వసుమతి, టెక్నికల్ అసిస్టెంట్ వెంకన్న, ఆర్ఐ ముగ్ధుంబాబా తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలి

నల్లగొండ కల్చరల్, సెప్టెంబరు 28 : తెలంగాణ సాహితీ దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని ప్రముఖ సాహితీ వేత్త అసిస్టెంట్ ప్రొఫెసర్ తండు కృష్ణ కౌండిన్య కోరారు. శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల ఆవరణలో ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి, మాట్లాడారు. సాహితీ రంగంలో విశేష కృషి చేస్తున్న తెలంగాణ సాహితీ సంస్థ ఏర్పడి పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నవంబరులో ఉత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా అధ్యక్షుడు కుకుడాల గోవర్ధన్, ప్రధాన కార్యదర్శి మహ్మద్ హుస్సేన్, సాగర్ల సత్తయ్య, లింగమూర్తి, జ్ఞానేశ్వర్ లింగస్వామి, మధు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జీవో నెంబర్ 25ను వెంటనే సవరించాలి


నల్లగొండ, సెప్టెంబరు 28: రాష్ట్ర ప్రభుత్వం జీవో 25ను వెంటనే సవరించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. జీవోకు వ్యతిరేకంగా శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్‌లో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం సర్దుబాటు నిమిత్తం విడుదల చేసిన ఆర్సీనెంబర్ 1267 ఉత్తర్వులు కూడా శాస్త్రీయంగా లేవన్నారు. ఆ ఉత్తర్వులనూ సవరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సైదులు, ప్రధానకార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం, రత్తయ్య, ఖుర్షీద్ బయ్యా, పీ వెంకులు, రాజశేఖర్‌రెడ్డి, రామదాసు, ఏడుకొండలు, మంగ్లానాయక్, వరలక్ష్మీ, జగతి పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీలు నేటి నుంచి

మిర్యాలగూడ టౌన్, సెప్టెంబరు 28: జాతీయస్థాయి కరాటే, కుంగ్‌ఫూ పోటీలు నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో ఆదివారం నుంచి ప్రారంభం కానున్నట్లు ఆర్గనైజింగ్ ఫౌండర్ బూడిద సైదులు, కరాటే మాస్టర్ బానావత్ రామకృష్ణనాయక్ తెలిపారు. పోటీలకు 1000 మంది క్రీడాకారులు హాజరవుతారని తెలిపారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, డీసీసీ ప్రెసిడెంట్ కేతావత్ శంకర్‌నాయక్, ప్రముఖ వ్యాపారవేత్త నవీన్ హాజరుకానున్నట్లు తెలిపారు.

మాస్టర్‌ప్లాన్ సవరణకు మోక్షమెప్పుడో?

● సూర్యాపేటలో సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతున్న ఓ మాస్టర్‌ప్లాన్
● వాటిని నమ్మొద్దంటున్న అధికారులు
● ప్రస్తుతం అమలులో 1982 మాస్టర్‌ప్లాన్



సూర్యాపేటలో సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతున్న నకిలీ మాస్టర్‌ప్లాన్ మ్యాప్

సూర్యాపేట(కలెక్టరేట్), సెప్టెంబరు 28 : జిల్లా కేంద్రంగా ఏర్పడిన సూర్యాపేట పట్టణం దినదినాభివృద్ధి చెందుతోంది. ఇప్పటికే అనేక విషయాల్లో జాతీయ, రాష్ట్రస్థాయిలో అవార్డులు అందుకున్న సూర్యాపేట మాస్టర్‌ప్లాన్ సవరణకు మాత్రం మోక్షం లభించడంలేదు. సూర్యాపేట మాస్టర్‌ప్లాన్ 1982లో రూపొందించినది అమలులో ఉంది. దీంతో అన్నివర్గాల ప్రజలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో పట్టణాభివృద్ధి కూడా కొంతమేర వెనుకబాటుకు గురవుతోంది. అందుకోసం మాస్టర్‌ప్లాన్‌ను సవరణ చేయాలని, దీంతో అభివృద్ధికి నిధులు కూడా అధికంగా రానుండడంతో గత ప్రభుత్వంలో చర్యలు చేపట్టారు. అందులో భాగంగా సూర్యాపేట మాస్టర్‌ప్లాన్ సవరణ చేసేందుకు ముందుగా పట్టణాన్ని అన్నివిధాలుగా సర్వే చేసి నివేదికను అందించాలని ప్రభుత్వం ఆధ్వర్యంలో ఓ ప్రైవేట్ సంస్థకు పనులు అప్పగించారు. ఆ సంస్థ పట్టణంలో సర్వే చేసి నివేదికలను అందజేసింది. అనంతరం నివేదికను పరిశీలించి పలుమార్పులు చేసి నూతన మాస్టర్‌ప్లాన్ ఏర్పాటుకు మునిసిపల్ తీర్మానం చేసి సంబంధిత ఫైల్‌ను ప్రభుత్వానికి పంపించారు. ప్రస్తుతానికి ప్రభుత్వం ఆమోదం కోసం ఎదురుచూస్తున్నారు. కాకపోతే ఇటీవల సోషల్ మీడియా చక్కర్లు కొడుతున్న పాత మాస్టర్‌ప్లాన్ మ్యాప్‌ను చూసి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంలో ఎలాంటి ఆందోళన చెందవద్దని ప్రభుత్వం ఆమోదించిన మాస్టర్‌ప్లాన్‌ను మాత్రమే ప్రజలు నమ్మాలని అధికారులు చెబుతున్నారు.

తీర్మానంతో మాస్టర్‌ప్లాన్ సవరణ ఫైల్

సూర్యాపేట మునిసిపాలిటీకి సంబంధించిన నూతన మాస్టర్‌ప్లాన్ సవరణ ఫైల్ ప్రభుత్వం వద్ద ఆమోదం కోసం పెండింగ్‌లో ఉంది. సూర్యాపేట గతంలో కంటే చాలా విస్తీర్ణంలో అభివృద్ధి చెందింది. గతంలో 34 వార్డులకే పరిమితమైన పట్టణం ప్రస్తుతం 48 వార్డులకు చేరింది. సూర్యాపేట పట్టణంలో సూర్యాపేట రూరల్, చివ్వెంల మండలాల పరిధిలోని రాయిగూడెం, పిల్లలమర్రి, కుప్పిరెడ్డిగూడెం, దురాజ్‌పల్లి, బీబీగూడెం, కుడకుడ గ్రామాలను విలీనం చేశారు. దీంతో పట్టణ విస్తీర్ణం పెరగడంతో పాటు జనాభా కూడా పెరిగింది. అయితే సూర్యాపేటలో 1982లో ఉన్న మాస్టర్‌ప్లాన్ అమలులో ఉంది. దీనితో అనేక ఇబ్బందులు కలుగుతున్నాయి. పట్టణంలోని డీమార్ట్ నుంచి అయ్యప్పస్వామి దేవాలయం వరకు ఉన్న ప్రాంతాన్ని పారిశ్రామిక జోన్‌గా ఏర్పాటుచేశారు. దీంతో పాటు కొత్త బస్టాండ్ వద్ద కుడకుడ రోడ్డులో అగ్రికల్చర్ జోన్‌గా ఏర్పాటుచేశారు. ఆయా ప్రాంతాల్లో నూతన ఇళ్ల నిర్మాణాలకు మునిసిపాలిటీ నుంచి అనుమతులు పొందడం ఇబ్బందిగా ఉంది. ప్రస్తుతం ఆయా ప్రాంతాలన్నీ నివాసప్రాంతాలుగా మారాయి. ఇలాంటి అనేక ఇబ్బందులు పాత మాస్టర్‌ప్లాన్‌తో ఉన్నాయి. అందుకోసం కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకం-2.0 ద్వారా మాస్టర్‌ప్లాన్‌ను సవరణ చేయాలని భావించారు. మాస్టర్‌ప్లాన్ సవరణ జరిగితే అదనపు నిధులు రావడంతో పాటు పట్టణం మరింత అభివృద్ధి చెందే అవకాశాలున్నాయి.



వాటిని నమ్మొద్దు

సోషల్‌మీడియాలో సూర్యాపేట పట్టణ నూతన మాస్టర్‌ప్లాన్ పేరుతో చక్కర్లు కొడుతున్న వాటిని నమ్మొద్దు. మాస్టర్‌ప్లాన్ సవరణ ఫైల్ ప్రభుత్వం వద్ద ఉంది. అక్కడి నుంచి ఆమోదం పొందిన మాస్టర్‌ప్లానే ప్రజలు పరిగణనలోకి తీసుకోవాలి. నూతన మాస్టర్‌ప్లాన్‌తో పట్టణ ప్రాంతాల జోన్లు మారే అవకాశం ఉంది. పట్టణం మరింత అభివృద్ధి చెందుతుంది.

శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్, సూర్యాపేట.

ప్రభుత్వం వద్ద సవరణ ఫైల్

సూర్యాపేట మునిసిపాలిటీ మాస్టర్‌ప్లాన్‌కు మోక్షం కలిగేలా కనబడడం లేదు. మాస్టర్‌ప్లాన్ సవరణ చేయాలని అందుకు సంబంధించిన డ్రాఫ్ట్‌ఫైల్‌ను 2023లో మునిసిపల్ తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపించింది. అంతకు ముందు ఓ ప్రైవేట్ సంస్థ చేసిన సర్వే నివేదికల ఆధారంగా పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పట్టణంలోని వివిధరకాల వ్యాపార వర్గాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, మేధావులు, విద్యావేత్తలు, రాజకీయ నాయకుల నుంచి అభిప్రాయాలను సేకరించి అందులో పలు మార్పులు, చేర్పులు చేసి తుది మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించి ప్రభుత్వానికి ఆమోదం కోసం పంపించారు. దీనిలో భాగంగా ప్రస్తుతం ఉన్న రోడ్లు, భవిష్యత్‌లో ఉండాల్సిన రోడ్లు, రెడ్ జోన్, గ్రీన్ జోన్, అగ్రికల్చర్ జోన్, రెసిడెన్షియల్, సెమీ రెసిడెన్షియల్ జోన్లు, పారిశ్రామిక జోన్, చెరువులకు సంబంధించి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను ఏర్పాటుచేస్తూ డ్రాఫ్ట్‌ఫైల్‌ను పంపించారు. అది ఆమోదం అయిన తర్వాత సూర్యాపేటలో ప్రజలకు పలు విభాగాలకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు ఉండే అవకాశాలు ఉండవు.

నమ్మిన యజమాని డబ్బులే కొట్టేసి..



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ రవి

సూర్యాపేటక్రైం, సెప్టెంబరు 28 : ఉపాధి కల్పించిన యజమాని డబ్బుకే ఎసరు పెట్టారు ఇద్దరు యువకులు. వ్యాపార నిమిత్తం యజమాని తీసుకవచ్చిన డబ్బును వాహనంలో భద్రపర్చగా వాటిని చోరీ చేసిన ఇద్దరు నేరస్తులను సూర్యాపేట జిల్లా కేంద్ర పట్టణ పోలీసులు అరెస్ట్‌చేశారు. వారి వద్ద నుంచి రూ.10.50లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ జీ రవి శనివారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కోదాడకు చెందిన పశువుల వ్యాపారి తాజుద్దీన్ వివిధ ప్రాంతాల్లో జరిగే వారసంతలకు వెళ్లి అక్కడ వివిధ రకాల పశువులను కొనుగోలుచేస్తాడు. అందులో భాగంగా ఈ నెల 16వ తేదీన సూర్యాపేటలో జరిగిన పశువుల సంతకు వచ్చాడు. ఆ సమయంలో పశువులను కొనుగోలు చేసేందుకు రూ.10.50లక్షల నగదును వెంట తీసుకొచ్చాడు. నగదును పశువులు తరలించే డీసీఎం వాహనంలోని సీటు వెనకాల భద్రపరిచాడు. గమనించిన తాజుద్దీన్ వాహన డ్రైవర్లు కోదాడకు చెందిన ఎస్‌డీ.జావెద్, షేక్ హయత్‌అలీ కలిసి చోరీచేశారు. సాయంత్రం నగదు చోరీకి గురైనట్లు తాజుద్దీన్ గుర్తించాడు. ఆరా తీసినా ఎవరూ తీయలేదని సమాధానమిచ్చారు. రెండు రోజుల పాటు విచారించినా డబ్బు లభించలేదు. దీంతో ఈ నెల 18న బాధితుడు పట్టణ పోలీసులకు ఫిర్యాదుచేశాడు. కేసు నమోదు చేసుకున్న పట్టణ పోలీసులు కేసును విచారణ చేయడంతో వాహన డ్రైవర్లు జావెద్, హయత్‌అలీలపై అనుమానం కలిగింది. దీంతో ఇద్దరు వ్యక్తులను శనివారం ఉదయం కోదాడలోని వారి వారి నివాసాల్లో అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా నగదును చోరీ చేసినట్లు అంగీకరించారు. వారి నుంచి నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి కోర్టుకు రిమాండ్‌కు పంపుతున్నట్లు తెలిపారు. నగదు చోరీ కేసును చాకచక్యంగా ఛేదించిన పట్టణ పోలీసులను డీఎస్పీ అభినందించారు. సమావేశంలో పట్టణ ఇన్‌స్పెక్టర్ జీ రాజశేఖర్, పట్టణ ఎస్ఐ బాల్నె కుశలవ, సిబ్బంది గొర్ల క్రిష్ణయ్య, గోదేశి కర్ణాకర్, జోగు సైదులు, శివ, చీకూరి మధు, సందీప్ ఉన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి



బస్సును ఢీకొట్టిన లారీ



రవీందర్, సతీష్‌రెడ్డి(ఫైల్‌ఫొటోలు)

చౌటుప్పల్ రూరల్, సెప్టెంబరు 28: యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం పరిధిలో 65వ నెంబరు జాతీయరహదారిపై ఆగి ఉన్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును కంటెయినర్ లారీ వెనుక నుంచి ఢీకొట్టడంతో ఇద్దరు ప్రయాణికులు మృతిచెందారు, తొమ్మిది మంది గాయపడ్డారు. సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా సత్తుపల్లి నుంచి హైదరాబాద్‌కు 40 మంది ప్రయాణికులతో శ్రీకృష్ణ ట్రావెల్స్ బస్సు శుక్రవారం రాత్రి బయలుదేరింది. శనివారం తెల్లవారుజామున 3గంటల ప్రాంతంలో ఆకస్మికంగా బస్సు రోడ్డు పక్కన ఆగిపోయింది. డ్రైవర్ బస్సు దిగి మరమ్మతులు చేస్తుండగా, బస్సులోని ప్రయాణికులు కూడా బస్సు దిగారు. ఇదే సమయంలో కలకత్తా నుంచి హైదరాబాద్‌కు ఫ్లిప్‌కార్ట్ లోడుతో వెళుతున్న కంటెనర్ లారీ అతివేగంతో వచ్చి ఢీకొట్టింది. బస్సును ఢీకొట్టడంతో బస్సు ముందుకు దూసుకు వెళ్లింది. ఈ ఘటనలో బస్సులో వెనుక సీటులో ఉన్న ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం మడంపల్లి గ్రామానికి చెందిన యజ్జు రవీందర్(24), బస్సు ముందు నిలుచుండి మరమ్మతులను పరిశీలిస్తున్న ఖమ్మం జిల్లా వేంసూరు మండలం వెన్నచెడువెంకటపురానికి చెందిన పాల సతీష్‌కుమార్‌రెడ్డి (46) అక్కడిక్కడే మృతి చెందారు. బస్సులో, బస్సు ముందు నిలిచి ఉన్న ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ ప్రయాణికులు ఖమ్మం జిల్లాకు చెందిన బండ్ల రవి (29), దుగ్గి నాగిరెడ్డి (52), తుమ్మనపల్లి వీరయ్య (55), గౌరజు శ్రీనివాస్(46), బస్సు డ్రైవర్ మామిళ్ల వెంకటరమేష్(32), జుబ్బూరి సాయికృష్ణ(27), బీమ్‌రెడ్డి సునీత(43), ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కంటెనర్ డ్రైవర్ గుడ్డు (30) గాయపడ్డారు. గాయపడ్డ వారిని హైదరాబాద్ ఎల్‌బీ.నగర్ కామినేని ఆస్పత్రి, ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలకు చౌటుప్పల్ ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి ...

తిప్పర్తి, సెప్టెంబరు 28 : గుర్తుతెలియని వాహనం ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందారు. ఈ ఘటన నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలంలో శనివారం జరిగింది. ఏఎస్ఐ జమాల్ తెలిపిన వివరాల ప్రకారం తిప్పర్తి నుంచి నకిరేకల్ వెళ్లే రహదారిలో డీ-40 కెనాల్ దగ్గర గుర్తుతెలియని వ్యక్తినని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానిక రైతులు ఇచ్చిన సమాచారంతో మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి తిప్పర్తి పంచాయతీ కార్యదర్శి నర్సింహస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ జమాల్ తెలిపారు.

ఇంట్లోకి దూసుకెళ్లిన ట్రాలీ ఆటో

బీబీనగర్, సెప్టెంబరు 28 : మద్యం మత్తులో ఆటో నడపడంతో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న ఓ ఇంట్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ మండలం చిన్నరావులపల్లి గ్రామంలో శనివారం సాయంత్రం జరిగింది. భువనగిరి మండలం రుస్తాపూర్ తండాకు చెందిన వ్యక్తి ట్రాలీ ఆటోలో ఊరూరా తిరుగుతూ ఉల్లిగడ్డల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. కాగా మద్యం మత్తులో బీబీనగర్ నుంచి నాగిరెడ్డిపల్లి వైపు ఆటోలో వెళ్తుండగా మార్గమధ్యలో చిన్నరావులపల్లి ప్రధాన కూడలి వద్ద మూలమలుపులో ఎడమ వైపు రోడ్డు పక్కన ఉన్న వడకాల స్వామి ఇంట్లోకి దూసుకెళ్లింది. వరండాలో కూర్చుని మాట్లాడుకుంటున్న ఇంటి యజమానురాలు వడకాల జంగమ్మతో పాటు ఇరుగుపొరుగు వారు వడకాల అశోక్, బెజవాడ నర్సమ్మ, బాలమ్మకు గాయాలయ్యాయి. వీరిని స్థానికులు హుటాహుటిన చికిత్స నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన ట్రాలీ ఆటో డ్రైవర్‌ను స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

నిలకడగా సాగర్ నీటి మట్టం

నాగార్జునసాగర్, కేతేపల్లి, మేళ్లచెర్వు, సెప్టెంబరు 28: నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటి మట్టం రెండు రోజులుగా 588.80 అడుగుల వద్ద నిలకడగా ఉంది. సాగర్‌కు ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 37,763 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు(312.0450టీఎంసీలు) కాగా ప్రస్తుతం 588.80అడుగులు (308.4658టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 10,200 క్యూసెక్కులు, ఎడమకాల్వ ద్వారా 5438 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 25,334 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400 క్యూసెక్కులు, వరదకాల్వ ద్వారా 400 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 43,772 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది.

మూసీ గేట్లు మూసివేత...

మూసీ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టడంతో ఎత్తి ఉన్న రెండు క్రస్ట్‌గేట్లను అధికారులు మూసివేశారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 645అడుగులు (4.46టీఎంసీ) కాగా ప్రస్తుతం 643.67అడుగులు(4.01టీఎంసీ)లుగా ఉంది. రెండో విడతగా కుడి కాల్వకు 192.60 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 216.67 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

పులిచింతల క్రస్టు గేట్లు మూసివేత

ఉభయ తెలుగురాష్ట్రాల సరిహద్దులోని పులిచింతల ప్రాజెక్టు అధికారుల ప్రాజెక్టు రెండు క్రస్టుగేట్లను మూసివేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175(45.77టీఎంసీలు) అడుగులు కాగా ప్రస్తుతం 174.70(45.30 టీఎంసీలుగా)అడుగులుగా ఉంది. ఎగువ నుంచి 24,560 క్యూసెక్కులు వరద వస్తుండగా, అవుట్‌ఫ్లో 16 వేల క్యూసెక్కులుగా ఉంది.

శాలిగౌరారం ప్రాజెక్టుకు జలకళ

శాలిగౌరారం : నల్లగొండ జిల్లా మధ్యతరహా ప్రాజెక్టులో ఒకటైన శాలిగౌరారం ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండి జలకళ సంతరించుకుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 21 అడుగులకు గాను 21అడుగలకు చేరింది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో కుడి, ఎడమ కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది.



కాళ్లూచేతులు కట్టేసి, హత్య చేసి..



శ్రీపతి జగదీష్(ఫైల్‌ఫొటో)

డిండి, సెప్టెంబరు 28 : కాళ్లూచేతులు కట్టి హత్యకు గురైన యువకుడి మృతదేహం నల్లగొండ జిల్లా డిండి మండలకేంద్రం సమీపంలో శనివారం లభ్యమైంది. యువకుడిది కేతేపల్లి మండలం కొప్పోలు గ్రామానికి శ్రీపతి జగదీష్(34)గా గుర్తించారు. సీఐ సురేష్ తెలిపిన వివరాల ప్రకారం డిండి మండలం కామేపల్లి గ్రామానికి చెందిన నకిరేకంటి అంజమ్మ, సాయిలు దంపతులకు నలుగురు కుమార్తెలు. చిన్నకుమార్తె రమాదేవిని 10 పదేళ్ల కిందట శ్రీపతి జగదీష్ ప్రేమవివాహం చేసుకున్నాడు. హైదరాబాద్‌లో మెడికల్ రిప్రజెంటేటీవ్‌గా పనిచేస్తున్నాడు. రెండేళ్లుగా భార్యాభర్తల మధ్య విభేదాలు రావడంతో వేరుగా ఉంటున్నారు. రమాదేవి హైదరాబాద్‌లో ఉంటున్న తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. రెండు రోజులుగా కనిపించకుండాపోయిన జగదీష్ డిండి మండలం చెర్కుపల్లి శివారులో శవమై కనిపించాడు. కాళ్లు, చేతులు తాళ్లతో కట్టి చెర్కుపల్లి శివారులోని దేవరకొండ - డిండి ప్రధాన రహదారిపై కొద్దిదూరంలో ఉండగా స్థానికులు గుర్తించారు. గ్రామస్థులు సమాచారం ఇవ్వడంతో దేవరకొండ డీఎస్పీ గిరిబాబు, పోలీస్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని డాగ్ స్క్వాడ్, క్లూస్‌టీంతో విచారణ చేపట్టారు. సోషల్‌మీడియాతో పాటు అన్ని గ్రూపుల్లో మృతదేహం ఫొటో పోస్టుచేశారు. కుటుంబ సభ్యులు గుర్తించి పోలీసులకు సమాచారం అందజేశారు. బండరాయితో మోదీ రెండు రోజుల క్రితం హత్య చేసినట్లు భావిస్తున్నారు. హత్యకు కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. జగదీష్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. డీఎస్పీ వెంట ఎస్ఐలు రాజు, సతీష్ ఉన్నారు.

ఏఆర్ కానిస్టేబుల్ సస్పెన్షన్

సూర్యాపేటక్రైం, సెప్టెంబరు 28 : సూర్యాపేట జిల్లాలో పనిచేస్తున్న ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుల్ ఎం.నరేష్‌ను సస్పెండ్ చేస్తూ మల్టీ జోన్-2 ఐజీ వీ సత్యనారాయణ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ మరో వివాహిత మహిళతో వివాహేతర సంబంధం ఏర్పరచుకుని పోలీస్‌శాఖ ప్రతిష్ఠకు మచ్చకలిగించేలా వ్యవహరించడంతో చర్యలు తీసుకున్నట్లు సమాచారం.ఈ విషయంలో ఇన్‌చార్జి జిల్లా ఎస్పీ,ప్రస్తుత నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్రపవార్ నివేదికమేరకు ఐజీ చర్యలు తీసుకున్నారు.

ఆలయాల్లో ప్రతినిత్యం పూజలు నిర్వహించాలి



అర్చకుల సమావేశంలో మాట్లాడుతున్న ఏసీ సులోచన

నల్లగొండ కల్చరల్, సెప్టెంబరు 28 : దేవాలయాల్లో ప్రతి నిత్యం దూపదీప నైవేద్యాలు, పూజలు నిర్వహించాలని దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ అన్నెపర్తి సులోచన అన్నారు. శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ భవనంలో నిర్వహించిన దూపదీప నైవేద్య అర్చకుల సమావేశంలో ఆమె మాట్లాడారు. విధులను సక్రమంగా నిర్వహించి మంచిపేరు తీసుకురావాలన్నారు. ఆలయాల్లో నూతనంగా నిర్మాణాలు జరిగిన వెంటనే తెలపాలన్నారు. ఆలయాలకు భక్తులు వచ్చేలా పూజలు ఉండాలన్నారు. కార్యక్రమంలో దూపదీప నైవేద్య అర్చక రాష్ట్ర, జిల్లా సంఘం నాయకులు వాసుదేవశర్మ, గుదె లక్ష్మీనర్సయ్య శర్మ, పోతులపాటి రామలింగేశ్వరశర్మ, పగిడిమర్రి ప్రసాద్‌శర్మ, రాజేశ్వరశర్మ, ఫణికుమార్‌శర్మ, మనోహర్ శర్మ, ఇన్‌స్పెక్టర్ లక్ష్మి, సుమతీ, జ్యోతి, సంతోషా పాల్గొన్నారు

కొట్టుకున్న కాంగ్రెస్ నాయకులు

● శ్రీనివాసపురంలో భగ్గుమన్న విభేదాలు

హుజూర్‌నగర్, సెప్టెంబరు 28 : సూర్యాపేట జిల్లా శ్రీనివాసపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకల మధ్య ఆధిపత్య పోరు తీవ్రస్థాయికి చేరింది. స్థానిక సంస్థల ఎన్నికలు రానున్న నేపథ్యంలో శనివారం నిర్వహించిన సమావేశం రసాభాసగా మారింది. హుజూర్‌నగర్ మండలం పార్టీ అధ్యక్షుడు చక్కెర వీరారెడ్డి, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు నిజాముద్దీన్‌లు పార్టీ గ్రామశాఖ సమావేశానికి అతిథులుగా హాజరయ్యారు. అయితే నాయకులు రెండు వర్గాలుగా ఏర్పడి ఒకరినొకరు కొట్టుకున్నారు. గ్రామశాఖ అధ్యక్షుడిని మార్చాలని అతడిపైనే దాడి చేశారు. దీంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. దీంతో ఒకరిపై మరొకరు చేయిచేసుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇతర పార్టీల నుంచి పార్టీలోకి వచ్చారు. దీంతో పార్టీ మూడు వర్గాలుగా అయ్యింది. నెల రోజుల కిందట ఒక వర్గం నాయకులు పార్టీ సమావేశం ఏర్పాటుచేసి ప్రస్తుత అధ్యక్షుడు గడ్డం రాజును తొలగించినట్లు ప్రకటించారు. దీంతో గడ్డంరాజు మండల ముఖ్యనాయకులను పిలిచి సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశంలో రెండువర్గాలకు చెందిన నాయకులు హాజరయ్యారు. దీంతో ముఖ్యనేతల ముందు బలప్రదర్శన చేశారు. అసలైన కాంగ్రెస్ వాదులం మేమేనంటూ వాదనకు దిగారు. కాగా కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డంరాజుపై దాడిచేసిన సందర్భంలో పెద్దఎత్తున రభస జరిగింది. రాజుకు మద్దతు ఇస్తున్నారంటూ పీఏసీఎస్ ఛైర్మన్ కట్టా గోపాల్‌రావును దూషించారు. గ్రామానికి చెందిన ఎస్ఆర్ఐ బలమైన వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయన కనుసన్నల్లోనే ఘర్షణ జరిగినట్లు గడ్డం రాజు ఆరోపించారు. కాగా స్థానిక సంస్థల నేపథ్యంలో ఒకరిపై ఒకరు పైచేయి సాధించేందుకు ప్రయత్నంలో భాగంగా ఘర్షణలు చోటుచేసుకుంటున్నట్లు భావిస్తున్నారు. సమావేశంలో ఘర్షణ విషయాన్ని మంత్రి ఉత్తమ్ దృష్టికి తీసుకెళ్తామని పరిశీలకులు నిజాముద్దీన్, వీరారెడ్డి, వీరనాగిరెడ్డి పేర్కొన్నారు.



ఘర్షణ పడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

'ఉద్యోగ భద్రత కల్పించాలి'

సూర్యాపేట(కలెక్టరేట్), సెప్టెంబరు 28: కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్. వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఏవోకు శనివారం వినతి పత్రం అందజేశారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనాలు, కార్మిక చట్టాలను అమలు చేయాలన్నారు. ఏళ్ల తరబడి పలు శాఖలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగం చేస్తున్నా రెగ్యులర్ చేయడం లేదన్నారు. అదనపు పనికి అదనపు వేతనం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు సాయికుమార్, లింగయ్య, వెంకన్న తదితరులు ఉన్నారు.

పేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలి : సీపీఎం

తిరుమలగిరి రూరల్, సెప్టెంబరు 28: మండలంలోని వెలిశాల గ్రామంలో పేదలకు రెండు పడక గదుల నిర్మాణం కోసం 2016 సంవత్సరంలో వేసిన శిలా ఫలకం కలగానే మిగిలిందని వెంటనే ఆ స్థలంలో పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి జి. ఉప్పలయ్య అన్నారు. గ్రామంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం 2016లో పేదలకు రెండు పడకల ఇళ్ల కోసం శిలాఫలకం వేసి మర్చిపోయిం దన్నారు. కనీసం ప్రస్తుత ప్రభుత్వమైనా పేదలకు ఆ స్థలంలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కడారి లింగయ్య, చిత్తలూరి సోమయ్య, పి. వెంకట య్య, క్రిష్ణయ్య, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ఏల వారసులకు ఉద్యోగ అవకాశం కల్పించాలి

మఠంపల్లి, సెప్టెంబరు 28: రెవెన్యూ శాఖలో 60ఏళ్లు పైబడి వీఆర్ఏలకు జీవో నెం81, 85 ప్రకారం వారి వారసులకు అదే శాఖలో ఉద్యోగ అవకాశాలు కల్పి ంచాలని వీఆర్ఏలు కోరారు. తహసీల్దార్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. మూడు దశాబ్దా కాలంగా రెవెన్యూ శాఖలో ఒక్క పక్క రాజకీయ ఒత్తిడి, మరో పక్క చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్న వీఆర్ఏలను ప్రభుత్వం ఉద్యోగ అవకాశం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జానీ, నాగుల్‌మీరా, అలీసాహెబ్, నాగుల్, సైదా పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే మహిళల ఆర్థికాభివృద్ధి సాధ్యం

నాగారం, సెప్టెంబరు 28: కాంగ్రెస్ పార్టీతోనే మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు తిరుమల ప్రగాడ అనురాధ అన్నారు. మండలంలోని వర్ధమానుకోటలో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి మహిళలకు ఉచిత బస్‌పాస్, రూ.500లకే గ్యాస్ కనెక్షన్, మహిళా సంఘాలకు తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తూ మహిళలు ఆర్థికంగా ఎదగడానికి తోడ్పుతున్నారన్నారు. కార్యక్రమంలో తోట జయమ్మ, నర్సమ్మ, పూలమ్మ ఉన్నారు.

లడ్డు కల్తీ బాధ్యులను కఠినంగా శిక్షించాలి

సూర్యాపేటటౌన్, సెప్టెంబరు 28: తిరుపతి లడ్డు ప్రసాద తయారీలో జరిగిన కల్తీ బాధ్యులను కఠినంగా శిక్షించాలని హిందూ ఐక్యవేదిక కన్వీనర్ నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు అన్నారు. జిల్లాకేంద్రంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. కోట్లాది మంది హిందువుల మనోభావాలను కించపరియే విధంగా తిరుపతి లడ్డు తయారీలో కల్తీ చేయడం దారుణమన్నారు. ఈ నెల 30వ తేదీన లడ్డు కల్తీపై హిందూ సంఘాల ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో నిరసన పాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలు హిందు సంఘాల నాయకులు కారింగుల ఉపేందర్, పసుపునూరి దినేష్‌బాబు, దరూరి రామానుజాచార్యులు, మురళీధరాచార్యులు, శ్రీధరచార్యులు, కొత్త అంజనేయులు, బ్రహ్మాండ్లపల్లి మురళీ, కేశవులు, సంతోష్, ప్రకాష్, చలమల్ల నర్సింహ, గజ్జెల వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

'అభివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యం కావాలి'

హుజూర్‌నగర్, సెప్టెంబరు 28: అభివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యం కావాలని మున్సిపల్ కమిషనర్ యాకోబ్ పాషా, వైస్ చైర్మన్ సంపత్‌రెడ్డి కోరారు. పట్టణంలోని 22వ వార్డులో స్వచ్ఛత-హీసేవా కార్యక్రమంలో భాగంగా రోడ్ల వెంట ఉన్న చెత్తాచెదారాన్ని శనివారం తొలగించారు. అనంతరం ప్రజలకు అవగాహన కల్పించారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయవద్దన్నారు. మున్సిపల్ ట్రాక్టర్లు వచ్చినప్పుడు చెత్తను అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు అమరబోయిన ఊహ, సతీష్, గాయత్రి, భాస్కర్, అశోక్, రాజశేఖర్‌గౌడ్, రంగారావు, శేఖర్‌రెడ్డి, సీతారాములు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు దీర్ఘకాలిక రుణాలు ఇస్తాం

హుజూర్‌నగర్, సెప్టెంబరు 28: రైతులకు దీర్ఘకాలిక రుణాలు అందిస్తామని హుజూర్‌నగర్ సహకార సంఘ చైర్మన్ నరేందర్ తెలిపారు. పట్టణంలోని సంఘ కార్యాలయంలో శనివారం నిర్వహించిన జనరల్‌బాడీ సమావేశంలో మాట్లాడారు. రైతులకు అవసరమైన ఎరువులు, పురుగుల మందులు అందిస్తున్నట్లు తెలిపారు. రైతు సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. రైతు రుణమాఫీ జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు మధురెడ్డి, లక్ష్మీ, మల్లమ్మ, శ్రీను, వెంకటేశ్వర్లు, లచ్చిరామ్, బ్రహ్మం, సీఈవో నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులను వేధిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు

కోదాడటౌన్, సెప్టెంబరు 28: వృద్ధాప్యంలో తల్లిదండ్రులను చూసుకోవాల్సిన బాధ్యత పిల్లలపైనే ఉంటుందని జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు తెలి పారు. కోదాడ పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో నిర్వహించిన శనివారం నిర్వ హించిన సామూహిక జన్మదిన వేడుకల్లో మాట్లాడారు. వృద్ధాప్యంలో తల్లిదం డ్రుల పోషణ, సంరక్షణ బాధ్యత పిల్లలపైనే ఉంటుందన్నారు. వృద్ధులను వేధిం పులకు గురిచేస్తే కఠిన చర్యలు ఉంటాయని వారి బాగోగులు విస్మరిస్తే గిఫ్ట్ రూపంలో పిల్లలకు ఇచ్చిన ఆస్తిని ఆర్డీవోకు దరఖాస్తు చేసుకుంటే 15 రోజుల్లో తిరిగి తల్లిదండ్రులు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యాక్షుడు రావెళ్ల సీతారామయ్య, ఎన్. సుదర్శన్‌రెడ్డి, బొల్లు రాంబాబు, కాంపాటి నరసయ్య, రఘువరప్రసాద్, అమృతరెడ్డి, జగన్మోహన్‌రావు, పోటు రంగారావు, శోభ, బిక్షం తదితరులు పాల్గొన్నారు.

రేబిస్ టీకాలు వేయించాలి

కోదాడ రూరల్, సెప్టెంబరు 28: పెంపుడు కుక్కల పిల్లలకు ఖచ్చితంగా మూడు మాసాల వయస్సు రాగానే రేబిస్ నివారణ టీకాలు వేయించాలని ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ పెంటయ్య సూచించారు. ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని క్రాంతి ది ఫౌండేషన్ పాఠశాలలో శనివారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రేబిస్ రహిత ప్రపంచమే లక్ష్యంగా ప్రపంచ రేబిస్ దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పెండెం వెంకటేశ్వర్లు, క్రాంతి ఫౌండేషన్ స్కూల్ ఫౌండర్, చైర్మన్, ప్రిన్సిపాల్ రాపోలు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో సత్వర న్యాయం పొందాలి



హుజూర్‌నగర్‌లో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్యామ్‌కుమార్



తుంగతుర్తిలో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి ఫర్హిన్ కౌసర్

హుజూర్‌నగర్, సెప్టెంబరు 28: కోర్టుల్లో సత్వర న్యాయం పొందేందుకు కక్షిదారులు సహకరించాలని సీనియర్ సివిల్ జడ్జి జిట్టా శ్యామ్‌కుమార్, జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్ కోరారు. పట్టణంలోని కోర్టులో శనివారం మెగాలోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసుల విషయంలో రాజీ మార్గమే రాజమార్గమన్నారు. లోక్‌అదాలత్‌లో న్యాయవాదులు, పోలీసుల పాత్ర ఎంతో కీలకమన్నారు. విలువైన సమయాన్ని వృధా చేయకుండా కేసులు పరిష్కరించుకోవాలన్నారు. క్షణికావేశంలో జరిగే పొరపాట్లను సరిదిద్దుకోవాలన్నారు. గత నాలుగు దఫాలుగా కేసుల పరిష్కారంలో హుజూర్‌నగర్ మొదటి స్థానంలో ఉందన్నారు. భవిష్యత్‌లో కూడా ఇదే ఒరవడిని కొనసాగించాలన్నారు. అనంతరం 900క్రిమినల్ కేసులు, 1800 సివిల్ కేసులు, 295 మోటార్ వాహన చట్టం నిబంధనల ఉల్లంఘన కేసులు పరిష్కారమైనట్లు తెలిపారు. దీంతో పాటు జరిమానా కింద రూ.18,85,950ల జరిమానా రూపంలో రాగా వాటిని ప్రభుత్వ ఖజానాలో జమచేయాలని జడ్జిలు ఆదేశించారు.

రాజీమార్గమే.. రాజమార్గం

తుంగతుర్తి: లోక్ అదాలత్‌ను ప్రజలు ఉపయోగించుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి ఫర్హిన్ కౌసర్ పిలుపునిచ్చారు. తుంగతుర్తిలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ సడ్జి ఫర్హిన్ కౌసర్ మాట్లాడుతూ లోక్ అదాలత్ అందరికీ రాజీమార్గం కుదిర్చే ఒక ఆయుధం అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు తాళ్లపల్లి సత్యనారాయణ, లోక్ అధాలత్ సభ్యులు బానోతు సతీష్, అనిల్‌కుమార్ యాదవ్, న్యాయవాదులు కారింగుల వెంకటేశ్వర్లు, చంద్రమౌళి, రాజారాం, మహరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌దే



మద్దిరాల : ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సామేలు

మద్దిరాల, సెప్టెంబరు 28: తెలంగాణ రాష్ట్రంలో రైతులకు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండలంలోని చౌళ్ల తండా గ్రామపంచాయతీ అవాసం రాజానాయక్‌తండాలో ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు విద్యుత్ విషయంలో ఏ మాత్రం ఇబ్బందులు కలగకుండా చూస్తాన్నారు. మద్దిరాల, నూతనకల్ మండలాలకు కలిపి ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేస్తానని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి గిరిజనతండాకు రోడ్లు వేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అమీన్‌సింగ్, ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి, అధికారులు ప్రాంక్లెన్, శ్రీనివాస్, సురేందర్, వెంకటచారి, ముక్కాల అవిలమల్లుయాదవ్, పచ్చిపాల వెంకన్న, వలమల్ల జయాకర్, వాసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, తాళ్లపల్లి సురేష్, సీతారాములనాయక్, కొమ్ము అంజయ్య, కంట్లం, శ్యాంరెడ్డి, లింగానాయక్, సుధాకర్‌నాయక్, ఎల్లేష్, శ్రీనివాస్, లింగయ్య పాల్గొన్నారు.

నూతన్‌కల్: రాష్ట్రంలో ఉన్న పేదలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను శనివారం పంపిణీ చేసి మాట్లాడారు. రాష్ట్రంలో మహిళలకు అతిపెద్ద పండగైన బతుకమ్మను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధ సుధాకర్‌రెడ్డి, తహసీల్దార్లు శ్రీనివాస్‌రావు, అమీన్‌సింగ్, ఎంపీడీవో సునీత పాల్గొన్నారు.

మంత్రి ఉత్తమ్‌కు ఎమ్మార్పీఎస్ నాయకుల సన్మానం



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కోదాడ, సెప్టెంబరు 28: నీటిపారుదల, పౌరసరఫరాల శాఖా మంత్రి ఎస్సీ ఎస్టీ వర్గీకరణ కమిటీ చైర్మన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న, ఆ సంఘం నాయకులు శనివారం హైదరాబాద్‌లో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు కోండ్రి శంకర్, రాష్ట్ర ఉపాధ్యాక్షులు కనుక జానయ్య మాదిగ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరికంటి అంబేద్కర్, దంతాల వెంకటయ్య, పడిదెల రవికుమార్, రామాంజి సైదులు, మేళ్లచెర్వు ముక్కంటి, చింత సైదులు, ఉపేందర్, నాగరాజు, వినోద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలి

తిరుమలగిరి, సెప్టెంబరు 28: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని డీఈవో అశోక్ అన్నారు. స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయంలో నిర్వహిస్తున్న ఇంగ్లీష్ ట్రైనింగ్ తరగతులను శనివారం పరిశీలించారు. అనంతరం అనంతారం మోడల్ స్కూల్, స్థానిక జెడ్పీహెచ్ఎస్ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శాంతయ్య, మండల నోడల్ అధికారి దామెర శ్రీనివాస్, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

కుల,మతాల నిర్మూలనకు పోరాడాలి

సూర్యాపేటటౌన్, సెప్టెంబరు 28: కుల,మతాల నిర్మూలనకై ప్రతి ఒక్కరు పోరాడాలని సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. సత్యశోధక్ సమాజ్ ఆవిర్భావం సందర్భంగా జిల్లాకేంద్రంలోని లెనిన్‌నగర్‌లో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. 1873లో మహాత్మ జ్యోతిరావుపూలే కుల, మతాలను నిర్మూలించాలని సత్యశోధక్ స్థాపించి స్త్రీలకు, అన్నివర్గాల వారికి విద్యను అందించారన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ ఫాసిస్టు విధానాలతో కులమత విద్వేషాలు పెంచడంతో ప్రజల మధ్య దూరం పెరుగుతోందన్నారు. కార్యక్రమంలో నాయకులు కారింగుల వెంకన్న, కొత్తపల్లి రేణుక, ఎర్ర అఖిల్‌కుమార్, పేర్ల నాగయ్య, గొడ్డలి నర్సయ్య, మారసాని చంద్రకళ,సూరం రేణుక, సయ్యద్, లింగయ్య, వీరబాబు, జయమ్మ, సంతోషిమాత, పద్మ ఉన్నారు.

వేణుమాధవ్ సినిమాలు సజీవంగా ఉంటాయి

కోదాడటౌన్, సెప్టెంబరు 28: వేణు మాధవ్ నటించిన సినిమాలు ఎప్పటికీ సజీవంగా ఉంటాయని కోదాడ మాజీ సర్పంచ్ పారా సీతయ్య, మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ అల్లం ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని తెర సంస్కృతిక కళామండలి ఆధ్వర్యంలో శనివారం హాస్యనటుడు వేణుమాధవ్ జయంతి నిర్వహించారు. సుమారు 500కు పైగా సినిమాల్లో నటించి అనేక అవార్డులు, సన్మానాలు పొంది రాష్ట్రానికి, కోదాడ పట్టణానికి పేరుతెచ్చారన్నారు. ఆయన భౌతికంగా లేకున్నా నటించిన సినిమాలు ఎప్పటికీ సంజీవంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో వేముల వెంకటేశ్వర్లు, కళామండలి సభ్యులు షేక్ మీరా, కోలా శ్రీనివాసరావు, తోట రంగారావు, బూర సైదారావు, మాలోతు సైదానాయక్, షేక్ యాకూబ్, పాలూరి సత్యనారాయణ, చలిగంటి రామారావు, గార్లపాటి వీరారెడ్డి, సుంకర సత్యనారాయణ, బూడిగం నరేష్, ఓరుగంటి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పర్యావరణంపై అవగాహన పెంచుకోవాలి

కోదాడ రూరల్, సెప్టెంబరు 28: విద్యార్థుల్లో పర్యావరణ స్పృహ పెరగాలని సీజీఆర్ రాష్ట్ర కోఆర్డినేటర్ యానాల వెంకటరెడ్డి అన్నారు. హరిత విప్లవ కమిటీ ఆధ్వర్యంలో మండలలోని కొమరబండలోని తేజ విద్యాలయంలో శనివారం సదస్సు నిర్వహించారు. ప్రతి పాఠశాలలో అతి పెద్ద వృక్షాన్ని ఎంపిక చేసి మాతృవృక్షంగా గుర్తించి వృక్ష సంరక్షణ పేరిట ప్రతి తరగతిలో విద్యార్థులకు బోధించాలన్నారు. పర్యావరణానికి హానికరమైన ప్లాస్టిక్, రసాయనాలను వాడకుండా ఉంచడంపై చైతన్య పరుస్తారని యానాల వెంకటరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ శంకరయ్య, నగేష్, అనుదీప్ పాల్గొన్నారు.

సాయిబాబా దేవాలయంలో పూజలు



కాగడ హారతి ఇస్తున్న పూజారి

నేరేడుచర్ల, సెప్టెంబరు 28: నేరేడుచర్ల సాయిబాబా దేవాలయంలో సాయిబాబా జయంతిని ఆలయ చైర్మన్ రాచకొండ రాంకోటేశ్వరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయి మందిరంలో ఆలయ పూజారి ఉగ్రదండి శివప్రసాదశర్మ, రవికుమారశర్మల ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, పంచామృతాభిషేకం, కాగడహారతితో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో బోనగిరి అంజయ్య, గజవెల్లి వెంకటేశ్వర్లు, కొణతం సత్యనారాయణరెడ్డి, అనంతుల సత్యనారాయణ, ఊటుకూరు నటరాజు, కందిబండ సత్యనారాయణ, శ్రీనివాసరావు, గోపాలకృష్ణ, సైదయ్య, చిత్తనూరి సత్యనారాయణ, సుధాకర్, వెంకన్న, పరమేషం, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

సూర్యాపేటటౌన్, సెప్టెంబరు 28: అంగన్‌వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి నర్సింహారావు అన్నారు. జిల్లాకేంద్రంలోని చర్చి కాంపౌండ్‌లో శనివారం నిర్వహించిన పోషణ అభియాన్ కార్యక్రమంలో మాట్లాడారు. ఐదు సంవత్సరాలలోపు చిన్నారులను సంపూర్ణ ఆరోగ్యవంతులను చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంఖ్య పెంచాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే బాలింతలకు, గర్భిణులకు ప్రభుత్వం అందజేసి పౌష్టికాహారంతో పాటు వారి ఆరోగ్యానికి కావాల్సిన అన్ని సౌకర్యాలు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో సుబ్బలక్ష్మి తదితరులు ఉన్నారు.

హుజూర్‌నగర్: సమాజంలో శిశు మరణాలు తగ్గించాలని మునిసిపల్ వైస్‌చైర్మన్ సంపత్‌రెడ్డి, ఎస్ఐ ముత్తయ్య, సీడీపీవో వెంకటలక్ష్మి కోరారు. శనివారం పట్టణంలోని వర్తక సంఘంలో పోషణఅభియాన్ మాసోత్సవాల సందర్భంగా ఏర్పా టుచేసిన సమావేశంలో మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు రక్తహీనత లేకుండా పోషక ఆహారం తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. శిశు మరణాల రేటు తగ్గించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సోమమ్మ, కౌన్సిలర్లు త్రివేణి, విజయ, గాయత్రి,భాస్కర్, సతీష్, గంగరాజు, రామకృష్ణ, మెడికల్ అధికారి పుష్పలత, కల్యాణి, స్వరూపారాణి, పద్మ, రవీందర్ పాల్గొన్నారు.

తుంగతుర్తి: పుట్టిన బిడ్డకు తల్లి పాలు ఎంతో శ్రేయస్కరమని తుంగతుర్తి సీడీపీవో శ్రీజ అన్నారు. శనివారం మండల కేంద్రంలో పోషణ అభియాన్ కార్యక్రమంలో బాగంగా గర్భిణీలకు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. తక్కువ ఖర్చుతో స్థానికంగా లభ్యమయ్యే ఆహార పదార్థాల్లో ఉండే పోషకాల గురించి వివరించారు. పోషకాహార లోపాలను అధిగమించడానికి అంగన్‌వాడీ టీచర్లు గ్రామస్థాయిలో మహిళలకు అవగాహన సదస్సు చేయాలని కోరారు. అనంతరం గర్భిణీస్త్రీలకు సీమంతాలు, అక్షరభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు మంగ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తిని కొనసాగించాలి



భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

సూర్యాపేటటౌన్, సెప్టెంబరు 28: స్వాతంత్ర సమరయోధుడు భగత్‌సింగ్ స్ఫూర్తిని నేటి యువత కొనసాగించాలని అఖిల భారత యువజన సమైక్య(ఏఐవైఎఫ్)పట్టణ కార్యదర్శి ఏడెల్లి శ్రీకాంత్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని రాఘువ ప్లాజా ప్రాంతంలో భగత్‌సింగ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. దేశంలో రోజురోజుకు మతోన్మాదం పెరిగిపోతుందని ఆవేదనవ్యక్తం చేశారు. ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర, ప్రభుత్వంపై ఉద్యమించడానికి సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బూర సైదులు, నాయకులు నిమ్మల ప్రభాకర్, సైదులు, నవీన్, నజీర్ పాల్గొన్నారు.

నేరేడుచర్ల: స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ 117వ జయంతిని శనివారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నేరేడుచర్ల ప్రధాన కూడలి వద్ద భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కొమ్రరాజు వెంకట్, కొండూరు జానయ్య, ఆవుల శ్రీను, శాంతయ్య, జాని, వెంకటాచారి, ఉపేంద్రచారి, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మునగాల: మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి నాగార్జునరెడ్డి

మునగాల రూరల్, సెప్టెంబరు 28: స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని నర్సింహులగూడెంలో శనివారం నిర్వహించిన మహాసభలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో పనిచేయాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టు శ్రేణులకు ఆదరణ పెరుగుతోందన్నారు. శ్రీలంకలో జరిగిన దేశాధ్యక్ష ఎన్నికల్లో యువ మార్క్సిస్టు నేత అధ్యక్షుడిగా ఎన్నిక కావడం శుభపరిణామమన్నారు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు ఎర్ర జెండా సిద్ధాంతం మాత్రమే విముక్తి కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, కోట గోపి, నాయకులు దేవరం వెంకటరెడ్డి, చందా చంద్రయ్య, జూలకంటి విజయలక్ష్మి, షేక్ సైదా, వీరబోయిన వెంకన్న, బచ్చలకూరి స్వరాజ్యం, రామకృష్ణారెడ్డి, నాగయ్య, సోమపంగు గురవయ్య, అచ్చయ్య పాల్గొన్నారు.

గరిడేపల్లి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వం నష్ట పరిహారం వెంటనే చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరి డిమాండ్ చేశారు. మండల పరిధిలోని కట్టవారిగూడెంలో శనివారం జరిగిన సీపీఎం గ్రామ జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడుతూ సంవత్సర కాలంగా నీళ్లు లేక పంటలు పండక రైతాంగం ఇబ్బందులు పడితే, నేడు భారీ వర్షాలకు పంటలు నష్టపోయి రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతుందన్నారు. నష్టపోయిన రైతులుకు ఎకరానికి రూ.50 వేలు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి షేక్ యాకుబ్, పటాన్ షైబెల్లి, మీసాల శ్రీనివాస్, మట్టయ్య, జానిమియా, సరోజనమ్మ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో ఆరు గొర్రె పిల్లలు మృతి

ఆత్మకూర్(ఎస్), సెప్టెంబరు 28: వీధికుక్కల దాడిలో ఇంట్లో ఉన్న ఆరు గొర్రె పిల్లలు మృతిచెందాయి. ఈ సంఘటన మండల పరిదిలోని ఏనుబాముల గ్రామంలో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన తగుళ్ళ జనార్ధన్‌కు చెందిన గొర్రె పిల్లలను ఇంట్లో ఉంచి గొర్రెలను మేతకు పంపగా వీదికుక్కలు దాడి చేసి ఇంట్లో ఉన్న ఆరు గొర్రె పిల్లలను చంపేశాయి. వీధి కుక్కల బెడదతో ప్రతిసారీ ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోందని జనార్ధన్ డిమాండ్ చేశారు.

సంక్షిప్త సమాచారం..

హుజూర్‌నగర్: హుజూర్‌నగర్‌లోని ఎన్ఎస్‌పీ క్యాంప్‌లో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పట్టణానికి చెందిన దామెర అనంతలక్ష్మీ రూ.40వేల విలువ చేసే క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. కారక్రమంలో కాలువ సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, రాము, రజని ఉన్నారు.

గరిడేపల్లి: తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టిశ్రీరాములు పేరును కొనసాగించాలని వాసవీ క్లబ్ మండల అధ్యక్షుడు గెల్లి సతీష్‌కుమార్ అన్నారు. మండలకేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. తెలుగు రాష్ట్రం కోసం ఆమరణ దీక్ష చేపట్టి రాష్ట్రాన్ని సాధించిన మహోన్నత వ్యక్తి పొట్టి శ్రీరాములు పేరు తొలగించడం సమంజసం కాదన్నారు. సమావేశంలో సుధా బ్యాంకు మేనేజర్ సురేష్, శ్రీరంగం ప్రసాద్, వరప్రసాద్, వీరప్రసాద్, ముచ్చర్ల గోపాల కృష్ణ, గుంటూరు రాము పాల్గొన్నారు.

నేరేడుచర్ల: గుర్రం జాషువా 129వ జయంతిని నేరేడుచర్లలోని అరిబండి భవన్‌లో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పారేపల్లి శేఖర్‌రావు, నాయకులు నాగేశ్వరావు, ధనుంజయనాయుడు, సుందర్‌రావు, నగేష్, శ్రీను, వెంకటయ్య, రామస్వామి, నవీన్, నీలా రాంమ్మూర్తి పాల్గొన్నారు.

మఠంపల్లి: మండలంలోని హనుమంతులగూడెం గ్రామానికి చెందిన జీపీ కార్మికురాలు పగిడిమర్రి ఈదమ్మ అనారోగ్యంతో మృతి చెందగా సీఐటీయూ నాయకులు నివాళులర్పించారు. ఈదమ్మ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటియూ జిల్లా కమిటీ సభ్యుడు సయ్యద్ రన్‌మియా కోరారు. సంతాపం తెలిపిన వారిలో భూక్యసైదానాయక్, ఇంటిరవి, దేవదానం, మోతీలాల్, సంతోషి, వెంకటమ్మ, అనిల్, వెంకటేశ్వర్లు, నరేష్, వీరబాబు, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

ఆత్మకూర్(ఎస్): ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలని జిల్లా విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ డి. జనార్ధన్ అన్నారు. మండలంలోని నెమ్మికల్ గ్రామంలో మండలస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిరుపేదల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి సామర్థ్యం పెంచాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో ధారాసింగ్, ప్రభాకర్, మురళీకృష్ణ, హెచ్ఎం శ్రీహరి, వెంకటయ్య, శ్రవణ్‌కుమార్, బాషిత్, వాసుదేవరెడ్డి, చౌదరిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, వెంకటరెడ్డి, యోగానంద చారి, జోహర్ పాల్గొన్నారు.

సూర్యాపేటటౌన్: జిల్లాకేంద్రంలోని త్రివేణి ఫంక్షన్‌హాల్‌లో కార్మిక నాయకుడు పెద్దిరెడ్డి రంగారావు వర్ధంతి సభ నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు పెద్దిరెడ్డి గణేష్, పెద్దిరెడ్డి రాజా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రంగారావు ఏఐటీయూసీ కార్మిక విభాగంలో ఉంటూ ప్రజల సమస్యలపై నిరంతరం పోరాటం చేశారని గుర్తుచేశారు.

తిరుమలగిరి: స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా తిరుమలగిరి మునిసిపాలిటీ ఉద్యోగులు, సిబ్బందికి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం మునిసిపల్ కార్యాలయంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం గురుకుల పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయ రాములు, కమిషనర్ బుచ్చిబాబు, డాక్టర్ మల్లెల వందన పాల్గొన్నారు.

మద్దిరాల: ఉపాధ్యాయుల సర్దుబాటు పేరుతో విడుదలైన జీవో నెం.25ను ఉపసంహరించుకోవాలని టీపీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు మట్టపల్లి రాధాకృష్ణ అన్నారు. మండలంలోని కుక్కడం గ్రామ జడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జిలతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాగయ్య, కృష్ణారెడ్డి, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.

అర్వపల్లి: గంజాయి, డ్రగ్స్ పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని అర్వపల్లి ఎస్ఐ బాలకృష్ణ అన్నారు. సైబర్ నేరాలు, గంజాయి , షీటీమ్స్‌పై అర్వపల్లి కేజీబీవీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు నిర్వహించిన అవగాహనలో మాట్లాడారు. కార్యక్రమంలో సూర్యాపేట షీటీమ్స్ మహిళ ఎస్ఐ నీలిమ, షిరీన్, ఎల్లారెడ్డి, కళాబృందం ఇన్‌చార్జి మల్లయ్య, గోపయ్య, గురులింగం, కృష్ణ, చారి, నాగార్జున పాల్గొన్నారు.

నూతన్‌కల్: మండల పరిధిలోని పెదనేమిల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు సూర్యాపేటలోని బాలభవన్‌లో శనివారం ప్రదర్శించిన వృక్షో రక్షతి రక్షతః నాటిక ప్రదర్శన జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం డి.శివయ్య తెలిపారు. విద్యార్థులను హెచ్ఎం శివయ్యతో పాటు, చైర్మన్ అరుణ, ఉపాధ్యాయులు హరికృష్ణ, ఉమారాణి, వెంకయ్య, సువర్ణలక్ష్మి, శమీమ్ సుల్తానా, ప్రశాంతి, విజయలక్ష్మి, సుదీర్‌కుమార్, సీఆర్పీ రవీందర్ అభినందించారు.

కోదాడటౌన్: జాతీయ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టరేట్‌లో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో పట్టణంలోని బాయ్స్ హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న ఎస్‌డీ సాధిక్ జిల్లా ప్రథమ స్థానంలో సాధించి కలెక్టర్ నుంచి షీల్డ్ ప్రశంసా పత్రం అందుకున్నాడు. పాఠశాలలో విద్యార్థి సాధిక్, జిల్లా సైన్స్ అధికారి లాం దేవరాజును కోదాడ ఎంఈవో సలీంషరీఫ్ సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం మార్కండేయ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగారం: ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన చిత్రలేఖనం పోటిలో వసునూరు మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న సుమన జిల్లాస్థాయిలో ద్వితీయ బహుమతి పొందినట్లు ప్రిన్సిపాల్ చంద్రబాబు తెలిపారు. కలెక్టర్ తెజస్ నందలాల్ పవార్ నుంచి విద్యార్థి అవార్డు అందుకున్నారు.

నాగారం: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న దివ్యాంగుల విద్యార్థులను గుర్తించి విద్యాశాఖ రూపొందించిన ప్రశస్తి యాప్‌లో నమోదు చేయాలని ఎంఈవో వాసం ప్రభాకర్ ఉపాధ్యా యులను కోరారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యా యులుకు ప్రశస్తి యాప్‌పై నిర్వహించిన శిక్షణలో మాట్లాడారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం జ్ఞానేశ్వరచారి, వెంకటేశ్వరరెడ్డి, విష్ణుమూర్తి, సీఆర్‌పిలు భాస్కర్, ఐఆర్‌పి ఎస్‌కె భాష తదితరులు పాల్గొన్నారు.